
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత సోమవారం గరిష్ఠం : 35.0 కనిష్ఠం : 24.0

ANDHRAJYOTHY

5



అనంతపురం

జిల్లా వార్తలు

మంగళవారం 2 సెప్టెంబరు 2025

అక్షరం అండగా..

పరిష్కారం



వడివడిగా..

కొత్తచెరువు సదస్సులో సమస్యలపై జనస్వరం..

వేగవంతంగా పరిష్కారానికి ఎమ్మెల్యే, అధికారుల హామీ



సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి (ఫైల్)

- ఇప్పటికే కొన్ని పరిష్కారం
- వివిధ దశల్లో మిగతావి..

నేడు సక్సెస్ సభ

పుట్టపర్తి/కొత్తచెరువు, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆంధ్రజ్యోతి నిర్వహించిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తోంది. ప్రజా సమస్యలు చకచకా పరిష్కారమవుతున్నాయి. 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' నినాదంతో ఈఏడాది జనవరి 28న కొత్తచెరువులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానం ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. అప్పట్లో సదస్సుకు కొత్తచెరువు బీసీ కాలనీ, ఎన్టీఆర్ నగర్, వేణుగోపాల్ నగర్, మండలంలోని పలు గ్రామాల నుంచి రైతులు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. తమ సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారుల ఎదుట విన్నవించారు. 28 మంది నేరుగా తమ సమస్యలను ఏకరవు పెట్టారు. అప్పట్లో సదస్సుకు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, కొత్తచెరువు సర్పంచ్ రాధతోపాటు మండలస్థాయి అధికారులు హాజరయ్యారు. వందలాది మంది తమ సమస్యలను వినతిపత్రం రూపంలో ఎమ్మెల్యేకి విన్నవించుకున్నారు. వాటిలో అవకాశం ఉన్నవాటిని తక్షణమే, మరి కొన్నింటిని నిర్దిష్ట గడువులోగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే, అధికారులు తెలిపారు. ప్రజాసమస్యలపై అధికారులకు ఎమ్మెల్యే చురకలు అంటించారు. చాలా వాటిని తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు. కొన్నింటికి కొంచెం గడువు పెట్టుకుని మొదటి ప్రాధాన్యత ప్రకారం పరిష్కరించేలా ప్రతిపాదనలు చేశారు. వాటి పరిష్కారానికి రూ.5.25 కోట్లదాకా అవుతుందని అంచనా వేశారు. ప్రధానమైన 18 సమస్యల్లో కొన్నింటిని పరిష్కరించారు. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. ఈనేపథ్యంలో ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో (మిగతా 6లో...)



విజయనగర్ కాలనీలో కొత్తగా నిర్మించిన ట్యాంకు వద్ద నీరు పట్టుకుంటున్న మహిళలు

ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు ఇవ్వాలి: కలెక్టర్



వృద్ధుడికి పింఛన్ డబ్బు ఇస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్

అనంతపురంరూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు ఇవ్వాలని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. మండలంలోని చియ్యేడు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేపట్టారు. కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి ఆయన పింఛన్లు అందజేసి వారితో మాట్లాడారు. సచివాలయ ఉద్యోగులు ప్రతినెలా ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు పంపిణీ చేస్తున్నారా, ప్రభుత్వం ఇచ్చిన పింఛన్ డబ్బు సరిపోతోందా, మీకు ఉపయోగపడుతోందా, దేనికి ఉపయోగించుకుంటున్నారు, పొదుపు ఏమైనా చేస్తున్నారా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పింఛన్ల పంపిణీ సజావుగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద 2,80,471 పింఛన్లు ఉన్నాయని, ఇందుకోసం రూ.123.86 కోట్లు పంపిణీ చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో సర్పంచు గంగాధర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, డీఆర్‌డీఏ పీడీ శైలజ, డీపీఓ నాగరాజు నాయుడు, జడ్పీ సీఈఓ శివశంకర్, డ్వామా పీడీ సలీం బాషా, ఎంపీడీఓ దివాకర్, టీడీపీ నాయకులు సాయినాథ్‌రెడ్డి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

తొలిరోజు 94.2 శాతం పింఛన్ల పంపిణీ

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం తొలిరోజు 94.2 శాతం పింఛన్ల సొమ్మును లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి సచివాలయ సిబ్బంది పంపిణీ చేశారు. ఈ నెలకు సంబంధించి జిల్లాకు 2,80,471 మంది పింఛన్‌దారులకు రూ.125.16 కోట్లు విడుదల చేశారు. సోమవారం సాయంత్రం 6 గంటల దాకా 2,64,110 మందికి రూ.117.47 కోట్ల (94.2 శాతం) పింఛన్ సొమ్మును పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ శైలజ పేర్కొన్నారు.



చంద్రబాబు తొలిసారి సీఎంగా బాధ్యతలు చేపట్టి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేసి ఇన్‌చార్జి మంత్రి టీజీ భరత్‌కు తినిపిస్తున్న మంత్రి కేశవ్, చిత్రంలో మంత్రి సవిత, ఎమ్మెల్యేలు, నేతలు

సూపర్ సిక్స్... సూపర్ హిట్!

- 15 నెలల్లో పథకాలు విజయవంతంగా అమలు
- 10న అనంతలో బహిరంగ సభ
- హాజరుకానున్న సీఎం చంద్రబాబు: మంత్రి పయ్యావుల కేశవ్
- పవన్ కల్యాణ్ కూడా వస్తారు..: జనసేన
- ఏర్పాట్లపై కూటమి నేతల సమావేశం
- సభాస్థలం పరిశీలన (వివరాలు 6లో....)

డీఎస్సీలో నకిలీల

కలకలం..!

వెరిఫికేషన్‌లో నిర్లక్ష్యం

ఈడబ్ల్యూఎస్ కోటాలో బోగస్ పత్రాలు

ఆధారాలతో ఫిర్యాదులు

అక్రమార్కులకు రెవెన్యూ అండ

ఆందోళనలో అర్హులు

(వివరాలు 7లో..)

ప్రధాని తల్లిపై అనుచిత వ్యాఖ్యలు తగదు

రాహుల్ గాంధీని శిక్షించాలి: బీజేపీ



టవర్‌క్లాక్ వద్ద ర్యాలీగా వెళ్తున్న బీజేపీ నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తల్లి హీరాబెన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీని కఠినంగా శిక్షించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ప్రధాని తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక టవర్‌క్లాక్ నుంచి ఎస్పీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. సప్తగిరి సర్కిల్‌లో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఎస్పీ జగదీష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాఫు రామచంద్రారెడ్డి, కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు, సెల్స్ స్టేట్ కన్వీనర్ చిరంజీవిరెడ్డి మాట్లాడుతూ.. నరేంద్రమోదీ తల్లి నిరుపేద కుటుంబంలో జీవితం గడిపినప్పటికీ పిల్లలను ఉన్నతమైన విలువలతో పెంచారని తెలిపారు. ఆ మాతృమూర్తి నేర్పిన విలువలతోనే నరేంద్ర మోదీ ప్రధానమంత్రి స్థాయికి చేరుకోగలిగారన్నారు. ప్రధాని మాతృమూర్తిని బీహార్ రాష్ట్రంలో ఎన్నికల సందర్భంగా చేపట్టిన యాత్రలో దూషిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ దేశ సమాజానికి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు అశోక్‌రెడ్డి, ఆంజనేయులు, శ్రీదేవి, సీనియర్ నాయకులు ఓలేటి రత్నమయ్య, అల్లాడి రామచంద్రయ్య, జగన్మోహన్, లలిత్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, ఈశ్వర్‌ప్రసాద్, బోనాల మారుతీ గోవింద్ ప్రసాద్, కార్యదర్శులు పోగుల నాగేంద్రబాబు, నారాయణరెడ్డి, మల్లేశ్వరి, అరుణ, ఆవుల చక్రధర్‌యాదవ్ పాల్గొన్నారు.

రూ.3 కోట్లు వృథా..!

- జగనన్న లేఅవుట్‌లో ప్రజాధనం కుమ్మరింత
- కోట్ల రూపాయలతో పనులు
- భూమి అనువైంది కాదని ముందుకురాని లబ్ధిదారులు (7లో)

రెవెన్యూలో ఆన్‌లైన్ కష్టాలు

సొంత భూమి ఎక్కించుకోవాలన్నా తిప్పలు

కాసులిచ్చినా కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ

తప్పుల తడకగా నివేదికలు

రైతులు, ప్రజలకు తప్పని ఇక్కట్లు



అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): భూముల విషయంలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. సొంత భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించుకోవాలన్నా తిప్పలు తప్పడం లేదు. రికార్డులు పక్కాగా ఉన్నా, ఏళ్ల తరబడి సాగులో ఉంటున్నా ఆన్‌లైన్‌లో ఎక్కించుకోవాలంటే మాత్రం నానా తంటాలు పడాల్సి వస్తోంది. ఇందుకు కాసులిచ్చినా తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. ముడుపులిస్తే మరొకరి భూమైనా వీళ్ల పేరుతో ఎక్కించేస్తారు. ఇలా చేయడం కొందరు రెవెన్యూ అధికారులకు వెన్నతో పెట్టిన విద్య. ఇలా ఎవరో ఆక్రమించిన భూమిని మార్పించి తన పేరుతో ఎక్కించుకోవడానికి ఆ రైతులకు తరాలు సైతం మారుతున్నాయంటే ఎంత దౌర్భాగ్య పరిస్థితి నెలకొందో చెప్పనక్కర్లేదు. తమ భూములను తమ పేరుతో ఆన్‌లైన్‌లో ఎక్కించుకోవడానికి రైతులు పడుతున్న తిప్పలు అన్నీఇన్నీ కావు. భూముల ఆన్‌లైన్ ప్రక్రియకు సంబంధించి ఏ ఫైల్ అయినా తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం, అక్కడి నుంచి కలెక్టరేట్‌కు వెళ్లాలి. మధ్యలో ఏ చిన్న డాక్యుమెంట్ కావాలన్నా మొత్తం ఫైల్ అంతా వెనక్కు పంపుతున్నారు. కొందరు తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లకు రిపోర్ట్ రాయడం కూడా చేతకావడం లేదనే విమర్శలు ఉన్నాయి.

నివేదికలో తప్పులు.. రైతుకు తిప్పలు

కూడేరు మండలం మరుట్లలో సర్వేనెంబరు 477లోని 3.50 ఎకరాలు ప్రైవేట్ భూమి ఉంది. మూడు లెటర్లు ఉన్న ఈ భూమిని సబ్ డివిజన్ చేయమని సర్వేయర్‌ను కోరితే.. తహసీల్దార్‌ను అడగాలంటూ తప్పించుకుంటున్నారట. గ్రామకంఠం భూమి అంటూ యజమానిని అధికారులు అడ్డుకుంటున్నారు. వాటిని సక్రమంగా తన పేరుతో ఎక్కించుకోవడానికి నాలుగు నెలల క్రితం దరఖాస్తు చేసుకున్నాడు. మూడు నెలలకు తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వెళ్లింది. నెలరోజులైనా స్పందన రాకపోవడంతో ఆ యజమానిపై అధికారులను ఆరా తీశాడు. ఆ నివేదిక విఫలంగా లేదని స్పష్టమైంది. ఆ ఫైల్ కలెక్టరేట్‌కు వెళ్తే వెనక్కు రావడం ఖాయమని చెప్పారట. ఆ నివేదిక ఇచ్చిన అధికారి మరో మండలానికి బదిలీ అయ్యారు. మరి ఆ ఫైల్ మళ్లీ పంపాలా..? ఎవరు పంపుతారు.? ఈ సమస్య ఎప్పుడు పరిష్కారమవుతుందంటూ ఆ భూమి యజమాని ఆందోళన చెందుతున్నాడు.

అడంగల్ దిద్దుబాటు కోసం ఆరేళ్లుగా..

అడంగల్‌లో దిద్దుబాటు కోసం ఓ రైతు ఆరేళ్లుగా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నాడు. కూడేరు మండలం కమ్మూరు గ్రామానికి చెందిన ఓ రైతుకు ఏడెకరాల పైచిలుకు పొలం ఉంది. ఆ భూమికి సంబంధించి ఆన్‌లైన్‌లో అడంగల్‌లో కరెక్షన్ చేయమని 2019లో అధికారులను కోరాడు. విచిత్రమేంటంటే ఆ సమస్య ఇంకా పరిష్కారం కాలేదు. ఆ ఫైల్ నడిచిన ఎన్నో నెలలకు సబ్ డివిజన్ చేయాలని కలెక్టరేట్ నుంచి వెనక్కు పంపారు. సబ్ డివిజనూ కాలేదు....అడంగల్‌లో కరెక్షనూ కాలేదు.

ఆన్‌లైన్‌లో మరొకరి పేరుతో...

గత కొన్నేళ్లుగా తమ పేర్లతో ఉన్న భూమి హఠాత్తుగా మరొకరి పేరుతో ఎక్కింది. వీరికి డాక్యుమెంట్లు, ఆధారాలున్నా ఏమీ చేయలేని పరిస్థితి. విడపనకల్లు మండలం డొనేకల్లుకు చెందిన శివన్నగౌడ్ కుటుంబానికి సంబంధించి దాదాపు 11 ఎకరాల పొలంలో ఆన్‌లైన్ సమస్య వచ్చి పడింది. అందులో సర్వేనెంబరు 275-డీ1లో 2.80 ఎకరాలు మరో మహిళ పేరుతో ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారు. ఆలస్యంగా చూసుకున్న ఈ కుటుంబసభ్యులకు మరో మహిళ పేరుతో ఉండటం చూసి అవాక్కయ్యారు. ఇప్పుడు ఆ భూమిని తమ పేరుతో ఎక్కించుకోవడానికి ఆ కుటుంబం నానా తంటాలు పడుతోంది. చివరికి రికార్డ్ ఆఫ్ రైట్స్(ఆర్ఓఆర్) ద్వారా ఆర్డీఓ కోర్టులో సమస్య పరిష్కరించుకోవాల్సి ఉంది.

రెవెన్యూ రికార్డులున్నా ఆలయ భూమిలో...

యాడికి మండలం నిట్టూరు గ్రామంలో ముగ్గురు అన్నదమ్ములకు చెందిన సర్వేనెంబరు 841లో ఐదెకరాలు ఆలయ భూమి (ఎండోమెంట్)లో చూపుతోంది. ఆ ముగ్గురిలో లక్ష్మన్నకు చెందిన సర్వేనెంబరు 841-ఏలో 1.72 ఎకరాలు మరొకరికి విక్రయించేందుకు ప్రయత్నించాడు. రిజిస్ట్రేషన్ సమయంలో ఆ భూమి దేవదాయ శాఖ(చెన్నకేశవస్వామి ఆలయ భూమి) పరిధిలో ఉందని చెప్పారట. ఈ విషయంపై రెవెన్యూ అధికారులను ఆరా తీయగా... రెవెన్యూ రికార్డుల ప్రకారం ఆ భూమి లక్ష్మన్నకు చెందినదిగానే చూపుతోందని చెప్పారు. కానీ దేవదాయ శాఖ అధికారుల ద్వారా ఆ భూమిని ఆన్‌లైన్‌లో తొలగించుకోవాల్సి ఉంది. ఆ సమస్య జిల్లా దేవదాయ శాఖ పరిధిలోనే పరిష్కారమవుతుందా..?లేక రాష్ట్ర స్థాయి అధికారులను కలవాలో అర్థం కాక ఆ భూమి యజమాని తల పట్టుకుంటున్నాడు.

జేసీ ప్రభాకర్ రెడ్డిపై కేసు

తాడిపత్రి, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రెండురోజుల క్రితం వినాయక నిమజ్జనం ఊరేగింపులో రామచంద్ర లాడ్జి వద్ద తలెత్తిన ఘర్షణలో మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వినాయక విగ్రహాల ఊరేగింపులో జేసీ ప్రభాకర్ రెడ్డి, కాకర్ల రంగనాథ్ వర్గాలు ఘర్షణకు దిగాయి. దీంతో జేసీ ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల రంగనాథ్‌తోపాటు వారి అనుచరులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపారు.

మోస్తరు వర్షం

అనంతపురం అర్బన్, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం వర్షం పడింది. గుత్తి, గార్లదిన్నె మండలాల్లో ఓ మోస్తరు వర్షం పడింది. అనంతపురం, యాడికి, విడపనకల్లు, బెళుగుప్ప, గుంతకల్లు, నార్పల, శింగనమల, కూడేరు తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

బీమా ప్రీమియం చెల్లింపు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 1,44,697 మంది రైతులు 2,30,097 హెక్టార్లకు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఫసల్, వాతావరణ బీమా ప్రీమియం చెల్లించారు. ఆగస్టు ఆఖరుతో ప్రీమియం చెల్లింపు గడువు ముగిసిందని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- ఆస్పత్రుల నిర్వాహకులకు డీఎంహెచ్ఓ హెచ్చరిక

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): నిబంధనలు ఉల్లంఘించే ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులపై చర్యలు తప్పవని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి హెచ్చరించారు. ఆమె తన కార్యాలయంలో సోమవారం మాట్లాడారు. ఏఆర్టీ, సరోగసీ సెంటర్లు నిబంధనలు తప్పక పాటించాలన్నారు. అర్హులైన వైద్య నిపుణుల పర్యవేక్షణలో ఐవీఎస్, ఐసీఐఎస్ వంటి చికిత్సలు చేయాలన్నారు. నేత్రాలు, వీర్యం, భ్రూణాలు విక్రయించడం నిషేధమన్నారు. ఆకట్టుకునే ప్రకటనలపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ఆస్పత్రులపై నేరుగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

అన్నదాతలను మింగిన అప్పులు

వేర్వేరుచోట్ల ఇద్దరు రైతుల ఆత్మహత్య (7లో...)

పర్యావరణం


గణపతి కరిగిన నీట.. గంగమ్మ కరుణకై వేట..!

ఊరి చివర..
ఉత్సవం ముగిసిన చోట..
ఉపాధి కోసం పేదల వేట..!

ఒక్కందుకు కటిక పేదరికమూ
మంచిదే అంటారేమో..!
ఇది పొట్టకూటి కోసం
చేసే రణం కాదు..
పర్యావరణ హితం..
అని సుద్దులు చెబుతారేమో..!

దిక్కులేని వారికి
దేవుడే దిక్కు అంటే ఇదేనేమో..!
ఈ రూపంలో బొజ్జ గణపతి
ఈ పేదల పొట్ట నింపుతున్నాడేమో!

స్వామి..
నువ్వు మునిగిన నీట
వీరు మునుగుతున్నారు కదా..
ఇంక పేదరికపు శాపం నుంచి
విముక్తి కలిగించు..!


ఇదిగో.. వింటున్నావా.. టెంకాయ దొరికింది.. రేపు చట్నీ చేసుకుందాం


ఏరినవన్నీ అమ్మేసి సన్న బియ్యం ప్యాకెట్ తెచ్చుకుందాం.. బువ్వ ఇట్ల కమ్మగా ఉంటుంది..!


పాపం పెద్దాయన..! ఏదైనా ఖరీదైనది దొరికితే బాగుండు..

(అనంతపురం రూరల్ మండలంలోని కొడిమి సమీపంలో..)

- ఆంధ్రజ్యోతి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్


పనికొచ్చేవన్నీ ఏరుకుందాం.. అమ్మేసి పండుగ చేసుకుందాం..


చెత్త నుంచి సంపద సృష్టి.. ఇలా కూడా..!

నేటి నుంచి క్రికెట్ టోర్నమెంట్


కెప్టెన్‌గా వ్యవహరించనున్న వీరారెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి ఆర్డీటీ స్టేడియంలో నేషనల్ ఇన్విటేషనల్ క్రికెట్ టోర్నమెంట్ అండర్-19 నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. టోర్నీకి మధ్యప్రదేశ్, బరోడా, ఆంధ్రా ప్రెసిడెంట్ ఎలెవన్, ఆంధ్రా సెక్రటరీ ఎలెవన్ జట్లు ప్రాతినిధ్యం వహించనున్నాయి. ఆంధ్రా ప్రెసిడెంట్ ఎలెవన్ జట్టుకు జిల్లా క్రీడాకారుడు కేహెచ్ వీరారెడ్డి కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఇప్పటికే ఆర్డీటీ స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. మంగళవారం నుంచి ఈనెల 11వతేదీ వరకు పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు.

రేపు పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా

రాయదుర్గంరూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 3వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12 ప్రముఖ ఎంఎన్‌సీ కంపెనీ ప్రతినిధులు వస్తున్నారని, జిల్లాకు చెందిన నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ ఏ బ్రాంచ్‌లలోనైన పూర్తి చేసిన వారు సర్టిఫికెట్లతో ఈ నెల 3న ఉదయం 9 గంటలకు గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణనందు హాజరు కావాలని వివరించారు. ప్రతి ఒక్కరూ రెజ్యూమ్, సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో రావాలని సూచించారు. పూర్తి వివరాలకు 9182920381 నెంబరకు కాల్ చేసి వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

సూపర్ సిక్స్... సూపర్ హిట్!

- 15 నెలల్లో పథకాలు విజయవంతంగా అమలు
- 10న అనంతలో బహిరంగ సభ
- హాజరుకానున్న సీఎం చంద్రబాబు
- మంత్రి పయ్యావుల కేశవ్
- పవన్ కల్యాణ్ కూడా వస్తారు..: జనసేన
- ఏర్పాట్లపై కూటమి నేతల సమావేశం
- సభాస్థలం పరిశీలన


సభాస్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, నేతలు

అనంతపురం క్రైం, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన 15 నెలల్లోనే సూపర్ సిక్స్ పథకాలను సూపట్ హిట్ అయ్యేలా చేసిందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఈనెల 10న సూపర్ సిక్స్-సూపర్ హిట్ పేరుతో అనంతలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. 3.50 లక్షల మంది ప్రజలు కలుస్తారని, ఇందులో ఏకంగా లక్ష మంది మహిళలే ఉంటారని ఆయన స్పష్టం చేశారు. అనంతపురంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఇన్‌చార్జి మంత్రి టీజీ భరత్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత, ముఖ్యమంత్రి కార్యక్రమాల కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, ఉమ్మడి జిల్లా పార్టీ పరిశీలకుడు కోవెలమూడి రవీంద్ర, ఎమ్మెల్యేలు, ఎంపీలు, జనసేన, బీజేపీ నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొలిసారి సీఎం పదవి చేపట్టి 30 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్ కట్ చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నాయకులు, ప్రజల తరఫున సీఎంకు శుభాకాంక్షలు తెలిపారు. తర్వాత ఈనెల 10వ తేదీ 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' బహిరంగ సభ నిర్వహణ స్థలం ఎంపిక, ఏర్పాట్లు తదితర అంశాలపై గంటన్నరపాటు చర్చించారు. అనంతరం మీడియా సమావేశం నిర్వహించారు. మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్‌గా అమలు చేశామన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం సాగిందన్నారు. ఇప్పుడిప్పుడే ఏపీ కోలుకుంటోందన్నారు. రాష్ట్రంలో గణనీయమైన మార్పు మొదలైందన్నారు. లా అండ్ ఆర్డర్ అద్భుతంగా అమలవుతోందన్నారు. అన్నివర్గాల ప్రజలు స్వేచ్ఛగా మాట్లాడగలుగుతున్నారన్నారు. తమకు నచ్చిన పని చేసుకుని బతుకుతున్నారన్నారు. తమ ప్రభుత్వంలో కక్ష సాధింపు ఉండబోదని స్పష్టం చేశారు. ఈనెల 10వ తేదీ అనంతపురంలో సూపర్ సిక్స్-సూపర్‌హిట్ పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. నగర పరిధి జీఎంఆర్ ఇంద్రప్రస్థ స్థలంలో సభ నిర్వహించేలా ఎమ్మెల్యేలు ఏకాభిప్రాయానికి వచ్చామన్నారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల మధ్య సభ ఉంటుందన్నారు. పార్టీ నిర్ణయమే ఫైనల్ అన్నారు. అందరూ సహకరించి సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పవన్ కల్యాణ్, బీజేపీ పెద్దలు కూడా..

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వంలో సూపర్ సిక్స్ పథకాలు అద్భుతంగా అమలవుతున్నాయన్నారు. వైసీపీ అనవసరంగా దుష్ప్రచారం చేస్తోందన్నారు. ప్రజలు, రైతులు, విద్యార్థులు అందరికీ పథకాలు అమలవుతున్నాయన్నారు. వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జనసేన నాయకుడు, అహుడా చైర్మన్ టీసీ వరుణ్ మాట్లాడుతూ.. ఏపీలో సూపర్ సిక్స్ పథకాలు చక్కగా అమలు చేస్తున్నారన్నారు. సభకు తమ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సైతం హాజరవుతారని తెలిపారు. తర్వాత కొత్తగా అనంతపురం జిల్లాకు మంజూరైన అంబులెన్స్‌ను మంత్రులు టీజీ భరత్, పయ్యావుల కేశవ్, సవిత, ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి ప్రారంభించారు. వారంతా జీఎంఆర్ ఇంద్రప్రస్థ స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో విప్ కాలవ శ్రీనివాసులు, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, గుమ్మనూరు జయరాం, కందికుంట వెంకటప్రసాద్, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, ఎంఎస్ రాజు, బండారు శ్రావణిశ్రీ, పల్లె సింధూరారెడ్డి, రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్ బీవీ వెంకటరాముడు, టీడీపీ అనంత, శ్రీసత్యసాయి జిల్లాల అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్, అంజినప్ప, నేతలు పరిటాల శ్రీరామ్, శ్రీధర్ చౌదరి, ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, నెట్టెం వెంకటేశులు, పల్లె రఘునాథరెడ్డి, రాయల్ మురళి, జనసేన నాయకులు మధుసూదన్, బీజేపీ నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

అక్షరం అండగా.. పరిష్కారం వడివడిగా..!

(5వ పేజీ తరువాయి)

మంగళవారం ఉదయం 10 గంటలకు కొత్తచెరువులోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సక్సెస్ మీట్ నిర్వహిస్తున్నారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డితోపాటు జిల్లా, మండలస్థాయి అధికారులు హాజరుకానున్నారు.

పరిష్కారం దిశగా..

- ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో అర్ధాంతరంగా ఆగిపోయిన ఇండోర్ స్టేడియం నిర్మాణానికి జూలై 10న కొత్తచెరులో మెగా పేరెంట్ మీటింగ్‌కు హాజరైన సీఎం చంద్రబాబు రూ.రెండు కోట్లు మంజూరు చేశారు.
- కొత్తచెరువులో శ్మశానవాటిక సమస్య పరిష్కారానికి సర్వే నంబరు 1451లోని 1, 2, 3 లెటర్లలో 3.70 ఎకరాల స్థలాన్ని రెవెన్యూ అధికారులు గుర్తించి పంచాయతీకి అప్పగించారు.
- బీసీ కాలనీలోని ఎల్-2, ఎల్-3 లేఅవుట్లలో విద్యుత్ లైన్, తాగునీటి సౌకర్యం కల్పించేందుకు రూ.10.60 లక్షలతో స్తంభాల ఏర్పాటు, బోర్ల తవ్వకానికి ప్రతిపానదనలు పంపారు.
- విజయనగర్ కాలనీలో రాముల ఆలయం వద్ద రూ.60 వేలతో తాగునీటి ట్యాంకు ఏర్పాటు చేశారు.
- వేణుగోపాల్ నగర్‌లో సీసీ రోడ్డు, డ్రైనేజీ కాలువ నిర్మాణానికి రూ.40లక్షలతో పంచాయతీరాజ్ శాఖ ప్రతిపాదనలు చేసింది.
- కొత్తచెరువులోని నాలుగు రోడ్ల కూడలిలో డివైడర్లపై తోపుడు బండ్లను పోలీసు శాఖ తొలగించి, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించింది.
- పెనుకొండ రహదారిలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణంతో పొలాల్లోకి దారి లేకుండా పోయిందని రైతులు విన్నవించారు. సమస్య పరిష్కారానికి రైల్వే శాఖ రూ.2 కోట్లతో రోడ్డు పనులు చేపట్టింది.
- దర్గా వీధిలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి గ్రామీణ నీటిసరఫరా, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో రూ.10లక్షలతో పైపులు ఏర్పాటు చేస్తున్నారు.
- బీసీ కాలనీలో సీసీ రోడ్డుకు ఇరువైపులా డ్రైనీజీ కాలువ రూ.12 లక్షలతో నిర్మించారు.


బీసీ కాలనీలోని ఎల్2 లేఅవుట్‌లో విద్యుత్ లైన్ ఏర్పాటుకు తెప్పించిన స్తంభాలు


అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా.. కార్యక్రమంలో పాల్గొన్న జనం (ఫైల్)


బీసీ కాలనీలోని ఎల్2 లేఅవుట్‌లో ప్రధాన రహదారికి ఇరువైపులా నిర్మించిన డ్రైనేజీ కాలువలు


కొత్తచెరువులో శ్మశాన వాటికకు కేటాయించిన భూమి

వయోజన విద్య సూపర్‌వైజర్ పోస్టులకు నోటిఫికేషన్

- 8 వరకు దరఖాస్తుల స్వీకరణ
- 12న ఇంటర్వ్యూలు

అనంతపురం విద్య, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): వయోజన విద్య శాఖలో ఖాళీగా ఉన్న సూపర్‌వైజర్ పోస్టుల భర్తీకి సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ, వయోజన విద్యాశాఖ డీడీ వెంకటేశులు వెల్లడించారు. ఉమ్మడి అనంతజిల్లాలో కదిరి డివిజన్‌లో ఒకటి, పెనుకొండ డివిజన్‌లో ఒకటి సూపర్‌వైజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. ఈ రెండు పోస్టులకు ప్రభుత్వ టీచర్ల నుంచి భర్తీ చేస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఎస్‌జీ టీచర్లు, పీఈటీలు, గ్రేడ్-2 భాషా పండితులు ఇందుకుఅర్హులు అన్నారు. 45 ఏళ్లలోపు ఉండి కనీసం పదేళ్ల అనుభవం ఉన్న వారు ఈ పోస్టులకు ఈనెల 8వతేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 12న ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

ఇన్నోవేషన్ మారథాన్‌లో నమోదు కావాలి

అనంతపురం విద్య, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్‌లో ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల తప్పనిసరిగా నమోదుకావాలని డీఈఓ ప్రసాద్‌బాబు, సైన్స్‌సెంటర్ క్యూరేటర్ బాలమురళి సోమవారం ప్రకటనలో ఆదేశాలు ఇచ్చారు. దీనిని కేంద్ర విద్యాశాఖ, సైన్స్ పరిశోధన సంస్థ సంయుక్తంగా పిల్లల్లో సైన్స్ పట్ల జిజ్ఞాస పెంచడానికి ఏర్పాటు చేశాయన్నారు. ఇందులో ప్రతిపాఠశాల మంగళవారంలోగా నమోదు కావాలని పేర్కొన్నారు. కనీసం 50 మంది విద్యార్థులను బృందంగా ఏర్పాటు చేసి ఆవిష్కరణలను తయారు చేయించాలని తెలిపారు. అనుమానాలు ఉంటే జిల్లా సైన్స్‌సెంటర్ క్యూరేటర్‌ను సంప్రదించి తెలుసుకోవచ్చని తెలిపారు.

టమోటా కిలో రూ.26

అనంతపురం రూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో సోమవారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.26తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠ ధర రూ.14, సరాసరిధర రూ.19తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 2,850 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

చీనీ టన్ను రూ.18వేలు

నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి ధర రూ.14వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 668 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

పంట నమో...దు!

నత్తనడకన ప్రక్రియ.. ముంచుకొస్తున్న గడువు

- సిబ్బంది నిర్లక్ష్యం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- సాంకేతిక సమస్యలతో ఇక్కట్లు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో ఈ పంట నమోదు ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. పంటల బీమా, పంట నష్టపరిహారంతోపాటు ఇతర రకాల లబ్ధి పొందాలంటే ఈ పంట నమోదే కీలకం. అలాంటి ప్రక్రియపై పలువురు వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు, సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. సంబంధిత శాఖల ఉన్నతాధికారుల పర్యవేక్షణాలోపమూ ఇందుకు కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాది జూలై మూడో వారంలో ఈ పంట నమోదు మొదలైంది. ఈనెల 15వ తేదీ వరకు గడువు విధించారు. 19 నుంచి 24వతేదీ వరకు గ్రామ సభలు నిర్వహించి, ముసాయిదా ఈ పంట జాబితాను ప్రదర్శించాలని నిర్ణయించారు. 25వ తేదీ నుంచి 28 వరకు ఈ పంట జాబితాపై అభ్యంతరాలు, అర్జీలు స్వీకరించనున్నారు. 30వతేదీ ఈ పంట తుది జాబితాను విడుదల చేయాలని రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

14 రోజులే గడువు..

ఖరీఫ్‌లో ఈ పంట నమోదుకు 14 మాత్రమే గడువు ఉంది. అయినా.. పంట నమోదులో పలు మండలాల్లో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వీడటం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా ఇప్పటి దాకా 2.21 లక్షల హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగయ్యాయి. ఇందులో వేరుశనగ 71,972, కంది 82,257 హెక్టార్లల్లో వేశారు. మిగతా విస్తీర్ణంలో మొక్కజొన్న, ఆముదం, పత్తి, వరి, జొన్న తదితర రకాల పంటలు సాగు చేశారు. గతనెలలో కురిసిన వర్షాలకు జిల్లాలో కంది, ఇతర రకాల పంటలు పెట్టారు. వ్యవసాయ శాఖ పరంగా ఇప్పటి దాకా జిల్లావ్యాప్తంగా 1.30 లక్షల ఎకరాల్లో మాత్రమే ఈ పంట నమోదు చేశారు. పలు మండలాల్లో సంబంధిత ఏఓలు ఈ పంట చేయాల్సిన రైతుల జాబితాను డౌన్‌లోడ్ చేసి సంబంధిత రైతు సేవాకేంద్రం సిబ్బంది, ఎంపీఈఓలకు కేటాయించడం లో తీవ్ర జాప్యం చేశారు. మరికొన్ని మండలాల్లో జాబితాను సిబ్బందికి కేటాయించినా క్షేత్ర స్థాయిలో ఈ పంట నమోదు చేయడంలో జాప్యం చేస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. పలు రైతు సేవాకేంద్రాల పరిధిలో ఎక్కువ విస్తీర్ణం ఉన్నా.. తక్కువ మంది సిబ్బంది ఉండటంతో ఆయా ప్రాంతాల్లో పనిచేస్తున్న సిబ్బంది ఈ పంట నమోదు చేయడంలో నానా తంటాలు పడుతున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం కనిపించ లేదని తెలిసింది.

34,318 ఎకరాలే..

ఉద్యాన పంటల నమోదులోనూ సంబంధిత అధికారులు, సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలున్నాయి. జిల్లా వ్యాప్తంగా 1.25 లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగులో ఉన్నాయి. ఇప్పటిదాకా 34,318 ఎకరాల్లో మాత్రమే ఈ పంట నమోదు చేయడంతో సరిపెట్టడం గమనార్హం. ఇప్పటిదాకా అరటి 5,434, చీనీ 14,279, మామిడి 4,101, దానిమ్మ 2,550, బొప్పాయి 413 ఎకరాలు, మరో 527 ఎకరాల్లో ఇతర రకాల పండ్ల తోటలు నమోదు చేశారు. కూరగాయ పంటలు 5,081, తోట పంటలైన కొబ్బరి, వక్క 521, సుగంధ ద్రవ్యాలు 1,276, పూల తోటలు 136 ఎకరాల్లో నమోదు చేశారు. జిల్లాలోని ఆరు మండలాల్లో 400 ఎకరాల్లో ఆయిల్ ఫాం సాగవుతోంది. ఇప్పటి దాకా ఆయిల్ ఫాం పంట ఈ పంట నమోదు చేయలేదు. ఈసారి తోటల్లో గట్టు మీద పెంచే కొబ్బరి, తాటిచెట్లు, చింత, అల్ల నేరేడు ఇతర రకాల చెట్లను ఈ పంట నమోదు చేయాలన్న నిబంధన విధించారు. గట్లపై పెంచే ఉద్యాన చెట్ల సంఖ్యను ఈ పంటలో నమోదు చేయాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియపైనా పలు ప్రాంతాల్లో సిబ్బంది జాప్యం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

సాంకేతిక సమస్యలతో ఇక్కట్లు..

ఈ పంట నమోదు ప్రక్రియలో పలు రకాల సాంకేతిక సమస్యలతో సిబ్బంది ఇక్కట్లు పడుతున్నట్లు సమాచారం. జియో కోఆర్డినేట్స్ ద్వారా పొలంలో రైతును నిలుచోబెట్టి ఫొటో తీసి, యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. గతేడాది 50 మీటర్ల దూరం వరకు జియో కోఆర్డినేట్స్‌తో ఫొటో తీసేందుకు అవకాశం ఉండింది. ఈసారి 5.1 వర్షన్‌లో 20 మీటర్ల దూరానికి కుదించారు. వరి పంటకు మాత్రమే 50 మీటర్ల దూరం వరకు అవకాశం ఇచ్చారు. మిగతా పంటలకు 20 మీటర్లే ఇచ్చారు. మూడేళ్ల క్రితం వరికి 200 మీటర్లు, ఇతర పంటలకు 100 మీటర్ల దాకా జియో కోఆర్డినేట్స్‌తో ఫొటో తీసే వెసులుబాటు కల్పించారు. ఏడాదికేడాదికీ ఈ పరిధిని తగ్గిస్తూ వస్తున్నారు. దీంతో సిబ్బంది ఫొటోలు తీయడంలో ఇబ్బంది పడుతున్నారు. గతంలో పంట సాగుచేసిన పొలాల్లో మాత్రమే ఈ పంట నమోదు చేస్తూ వచ్చారు. ఈ ఏడాది సరికొత్తగా పంటలు సాగు చేయని పొలాలను సైతం నమోదు చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. పంట సాగుచేసిన పొలంతోపాటు బీడు భూములను నమోదు చేయడం ఇబ్బందిగా మారిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని డీ పట్టాలు, రీ సర్వే చేసిన గ్రామాల్లోని భూములు యాప్‌లో కనిపించడం లేదు. దీంతో ఆయా ప్రాంతాల్లోని డీ పట్టా భూములు, రీసర్వే చేసిన గ్రామాల్లో ఈ పంట నమోదు ఆగిపోయింది. సాంకేతిక సమస్యల పరిష్కారానికి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు తక్షణ చర్యలు చేపడితేనే ఈ పంట నమోదు సవ్యంగా సాగే పరిస్థితి ఉంది. లేదంటే సకాలంలో పూర్తి చేయడం కష్టమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరి ఏమేరకు రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు స్పందిస్తారో వేచిచూడాల్సిందే.


ఉద్యాన తోటల్లో ఈ పంట నమోదు చేస్తున్న సిబ్బంది

డీఎస్సీలో నకిలీల కలకలం..!

- వెరిఫికేషన్‌లో నిర్లక్ష్యం
- ఈడబ్ల్యూఎస్ కోటాలో బోగస్ పత్రాలు
- ఆధారాలతో ఫిర్యాదులు
- అక్రమార్కులకు రెవెన్యూ అండ
- ఆందోళనలో అర్హులు

అనంతపురం విద్య, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025 నియామకాలలో నకిలీలు చొరబడినట్లు పెద్దఎత్తున విమర్శలు రావడంతో కలకలం రేగుతోంది. నకిలీల మోసాలపై అర్హులైన అభ్యర్థులు అధికారులకు ఆధారాలతో ఫిర్యాదులు చేస్తుండడంతో ఆరోపణలకు మరింత బలం చేకూరుతోంది. ప్రధానంగా ఈడబ్ల్యూఎస్ (ఎకనామికల్లీ వీకర్స్ సెక్షన్) ఓసీ కుటుంబాలకు ఈ కోటాకింద ఉద్యోగాలు ఇస్తారు. ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లలో అధికంగా బోగస్‌వి పుట్టించుకున్నారు. రెవెన్యూ శాఖలో కొందరు అమ్యామ్యాలకు పాల్పడి, మరికొందరు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి నిబంధనలకు విరుద్ధంగా ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు ఇచ్చారనే విమర్శలు ఉన్నాయి. నిబంధనల మేరకు కుటుంబానికి ఐదెకరాలు మెట్ట భూమి ఉంటేనే అర్హులు. కానీ రెవెన్యూ యంత్రాంగం మాయాజాలం చూపించి అధికభూములు ఉన్నా లేవని ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు జారీచేస్తోందనే ప్రచారం జోరుగా సాగుతోంది.

ఆరోపణల్లో కొన్ని..

తాడిపత్రి పట్టణానికి చెందిన ఓ అభ్యర్థి డీఎస్సీలో ఫిజికల్ డైరెక్టర్ (పీడీ) పోస్టుకు ఎంపికయ్యాడు. ఈయనది కడప జిల్లా కొండాపురం మండలం. తాడిపత్రిలో నివాసముంటూ ఇక్కడే చదివి లోకల్‌గా ఇప్పుడు పోస్టు దక్కించుకున్నాడు. ఇంత వరకు బాగానే ఉన్నా.. ఇతడి తండ్రి(లేట్)పేరు మీద 8.67 ఎకరాలు, తల్లి పేరు మీద 2.66 ఎకరాల భూములు ఉన్నాయి. ఈ అభ్యర్థికి తాడిపత్రి రెవెన్యూ అధికారులు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్‌ను జారీ చేశారని ఆధారాలతో బయటపెట్టారు. శెట్టూరు మండలానికి చెందిన ఓ అభ్యర్థి కూడా డీఎస్సీలో పీడీగా ఎంపికయ్యాడు. ఈయన ఈడబ్ల్యూఎస్ కోటా కిందనే ఎంపిక కావడం వివాదం రేపుతోంది. అభ్యర్థి పేరుమీద మూడు ఎకరాలు, ఆయన తండ్రి పేరు మీద ఆరు ఎకరాలు, అన్న పేరు మీద 3.58 ఎకరాలు భూములు ఉన్నాయి. ప్రభుత్వం నిర్వహించిన హౌస్‌హోల్డ్ సర్వేలో వీరందరూ ఉమ్మడి కుటుంబంగా చూపుతోంది. కానీ ఈ అభ్యర్థికి రెవెన్యూ అధికారులు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్‌ను జారీ చేశారు. కదిరి ప్రాంతంలో ఓ అభ్యర్థి పీహెచ్ కింద సదరం సర్టిఫికెట్‌తో ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ పొందుతూ వచ్చారట. డీఎస్సీలో దరఖాస్తు చేసుకొని పీడీ (ఫిజికల్ డైరెక్టర్) పోస్టు కొట్టారట. డీఎస్సీ నిబంధనల మేరకు పీహెచ్‌లు పీడీ పోస్టులకు అనర్హులు. అయినా ఇన్నేళ్లు పీహెచ్ సదరం సర్టిఫికెట్‌తో పింఛన్ తీసుకుంటూ ఇపుడు డీఎస్సీలో సాధారణ వ్యక్తిగా ఉద్యోగం పొందడంపై తీవ్రచర్చసాగుతోంది. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. ఇతర మెడికల్ సర్టిఫికెట్లపైనా ఆరోపణలు వస్తున్నాయి.

అక్రమార్కులకు రెవెన్యూ సహకారం

ఎలాగైనా ఉద్యోగం సంపాదించాలనే ఆశతో అభ్యర్థులు అడ్డదారుల తొక్కుతున్నారు. ఇందుకు రెవెన్యూ అధికారులు సహకారం అందిస్తున్నారు. ఇందుకు తాడిపత్రి అభ్యర్థి ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెటే నిలువెత్తు నిదర్శనం. ఈ అభ్యర్థి తండ్రి చనిపోయాడు. ఆయన ఒకడే కొడుకు, తల్లితో కలిసి ఉంటున్నాడు. కొండాపురం మండలంలో తండ్రికి 8.67 ఎకరాలు, తల్లికి 2.66 ఎకరాల భూమి ఉంది. తాడిపత్రిలో నివాసం ఉంటూ ఇక్కడ తమకు భూమిలేదని చూపించుకున్నారు. 1-బీ అడంగల్‌లోను, ఈసీ కోరగా అందులోను ఈ భూములు ఉన్నట్లు రికార్డుల్లో కనిపిస్తున్నాయి. రెవెన్యూ అధికారులకు డబ్బులు ముట్టచెప్పి ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ పొందుతున్నారని తెలుస్తోంది. వీటి వల్ల నష్టపోతున్న బాధిత అభ్యర్థులు నకిలీ ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లపై ఆధారాలు సేకరించారు. ఈ మేరకు సోమవారం బాధిత అభ్యర్థులు కలెక్టరు వినోద్‌కుమార్, డీఈఓ ప్రసాద్‌బాబును వేర్వేరుగా కలిసి ఆధారాలతో ఫిర్యాదులు ఇచ్చారు. మరోవైపు ఆరోపణలు ఎదుర్కొంటున్న తాడిపత్రి అభ్యర్థి సైతం డీఈఓను కలిసి తమకు రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు ఇదిగో అంటూ అందజేసి వెళ్లాడు. డీఎస్సీలో నకిలీల వ్యవహారాలు బయట పడుతుండడంతో ఇటు అధికారులు, అటు అభ్యర్థులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. జాబితా మొత్తం రాష్ట్రశాఖనే ఎంపికచేస్తోందని, తమ చేతుల్లో ఏమీ లేదంటూ జిల్లా విద్యాశాఖ నిస్సహాయతను వ్యక్తం చేస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి బోగస్‌లపై చర్యలు తీసుకుని నిజమైన ప్రతిభ అభ్యర్థులకు పోస్టులు దక్కేలా చూడాలని అభ్యర్థులు, వారికుటుంబసభ్యులు విన్నవించుకుంటున్నారు.



వెరిఫికేషన్‌కు హాజరైన అభ్యర్థులు (ఫైల్)

ఫిర్యాదులు వాస్తవమే



డీఎస్సీలో ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లలపై పలు ఫిర్యాదులు వస్తున్న విషయం వాస్తవమే. కొందరు బాధిత అభ్యర్థులు ఆధారాలతో సహా తీసుకొచ్చి ఫిర్యాదు చేస్తున్నారు. వాటన్నింటిని తీసుకొని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతాం. ప్రత్యేక అధికారులను ఏర్పా టు చేసి ఈ సర్టిఫికెట్లపై విచారణ చేయిస్తాం. నిజమైన అర్హులకు న్యాయం జరిగేలా చూస్తాం.

-ప్రసాద్‌బాబు, డీఈఓ

ఆ 50 మందికి నిరాశే..

విడుదలకాని డీఎస్సీ అభ్యర్థుల జాబితా

5న తుది జాబితా అంటున్న రాష్ట్రశాఖ

అనంతపురం విద్య(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ అభ్యర్థులతో రాష్ట్ర విద్యాశాఖ అధికారులు చెలగాటమాడుతున్నారు. మెరిట్ లిస్టు ఇచ్చి సెలెక్షన్ జాబితా పూర్తి స్థాయిలో విడుదల చేయడంలేదు. జిల్లాలో 807 టీచర్ పోస్టులకు అభ్యర్థుల సెలెక్షన్ జాబితా ఇవ్వాల్సి ఉంది. ఇప్పటికి రెండు విడతలలో 757 మంది పేర్లు విడుదల చేసి వారి సర్టిఫికెట్లను పరిశీలించారు. మిగిలిన 50 మంది సెలెక్షన్ అభ్యర్థుల జాబితాను సోమవారం ప్రకటిస్తామని, మెసేజ్‌లు వస్తాయని రాష్ట్ర శాఖ అధికారులు ప్రకటించారు. దీంతో అభ్యర్థులు మెసేజ్‌లు, జాబితా కోసం ఎదురు చూశారు. సోమవారం మిగిలిన 50 మంది అభ్యర్థుల సెలెక్షన్ జాబితా విడుదల కాలేదు. ఎవరికీ మెసేజ్‌లు రాలేదు. రాత్రి పొద్దుపోయేవరకు కొందరు అభ్యర్థులు డీఈఓ కార్యాలయం వద్దే పడిగాపులు కాశారు. మరికొందరు ఫోన్లు చేస్తూ ఆరా తీశారు. జాబితా, మెసేజ్‌లు రాకపోవడంతో అభ్యర్థులు తీవ్ర నిరాశ చెందారు.

ఇదిలా ఉండగా.. సోమవారం రాష్ట్ర అధికారులు డీఎస్సీ సెలెక్షన్ ఫైనల్ జాబితా ఈనెల 5న ప్రకటిస్తామని జిల్లా విద్యాశాఖ అధికారులకు కాన్ఫరెన్స్‌లో చెప్పారు. ఇప్పటి వరకు జాబితా రాలేదు, వెరిఫికేషన్ పెండింగ్ ఉంది, మరో వైపు వివిధ రకాల ఫిర్యాదులు వస్తున్నాయి. ఇలాంటి పరిస్థితులలో డీఎస్సీ ఫైనల్ సెలెక్షన్ జాబితా ఎలా విడుదల చేస్తారో అర్థంకావడంలేదు. దీంతో అభ్యర్థుల్లో మరింత టెన్షన్ మొదలైంది.

చెరువులో పడి యువకుడి మృతి



బత్తా మహేశ్ (ఫైల్)

ధర్మవరం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ధర్మవరం చెరువులో పడి ఓ యువకుడు మృతి చెందాడు. వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని మార్కెట్‌వీధికి చెందిన బత్తా మహేశ్(36) ఆదివారం నిమజ్జనానికి వెళ్లాడు. నిమజ్జనంలో ముఖంపై, శరీరంపై పడిన రంగులను శుభ్రంచేసుకోవడానికి సోమవారం ఉదయం ధర్మవరం మొదటి మరువ వద్దకు వెళ్లాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న అతడు చెరువు వద్ద రంగులు పోవడానికి కడుక్కొంటుండగా కాలు జారీ చెరువులో పడ్డాడు. చెరువులో నీటి బురదలో ఇరుక్కుపోయి మృతి చెందాడు. చేపల పట్టడానికి వెళ్లిన వారికి మృతదేహం కనిపించడంతో డయల్ 100కు కాల్ చేశారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తన సిబ్బందితో చెరువు వద్దకు వెళ్లి అగ్నిమాపక సిబ్బందిని పిలిపించి గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం 2గంటల సమయంలో మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి భార్య విమల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడు కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మృతుడికి భార్యతోపాటు కుమారుడు నిహాన్ ఉన్నాడు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ నాయకుడు..



చిన్న పులికొండ (ఫైల్)

గుత్తిరూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటకల్లు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు చిన్న పులికొండ (45) ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గ్రామానికి చెందిన చిన్న పులికొండ గత నెల 24న నంద్యాల జిల్లా ప్యాపిలికి వెళ్లి ఇంటికి బైక్ వస్తుండగా ప్యాపిలి వద్ద బైక్‌ను బొలెరో వాహనం ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి ప్యాపిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వాహనం ఢీకొని గొర్రెల కాపరి..

కనగానపల్లి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని భానుకోట పుట్టకనుమ సమీపంలో సోమవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక గొర్రెల కాపరి మృతి చెందగా.. మరో కాపరి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు.. కొండపల్లికి చెందిన బంగి నరసింహులు(50) సోమవారం తగరకుంటకు వెళ్లాడు. అక్కడి నుంచి కంబదూరు మండలం బాలవెంకటాపురం గ్రామానికి చెందిన గొర్రెల యజమాని ముత్యాలప్పతో కలసి.. కంబదూరుకు ద్విచక్ర వాహనంలో వెళుతున్నారు. ఈ క్రమంలో భానుకోట వైపు నుంచి ఎదురుగా వచ్చిన గుర్తుతెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని వేగంగా ఢీకొట్టింది. ప్రమాదంలో నరసింహులు, ముత్యాలప్ప తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నరసింహులు మృతిచెందగా, ముత్యాలప్పను మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. నరసింహులుకు భార్య నారాయణమ్మతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ విత్తనాలపై రైతుల ఆగ్రహం



దుకాణం వద్ద మొక్కజొన్న కంకులతో నిరసన తెలుపుతున్న రైతులు

తాడిపత్రి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీబీ రోడ్డులోని ఒక దుకాణంలో నకిలీ విత్తనాలు పంపిణీ చేశారని కడప జిల్లా ముద్దనూరు మండలం శెట్టివారిపల్లికి చెందిన రైతులు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడు నెలల క్రితం తమ గ్రామానికి చెందిన 30 మంది రైతులు వచ్చి మొక్కజొన్న విత్తనాలు కొనుగోలు చేశామని తెలిపారు. అదును వచ్చినా మొక్కజొన్న కంకుల్లో విత్తనాలు రాకపోవడంతో యాజమానికి పలుసార్లు చెప్పినా పట్టించుకోలేదని వాపోయారు. ఎకరాకు 40 క్వింటాళ్లు మొక్కజొన్న పంట పండుతుందని నమ్మకంతో ఇక్కడికి వచ్చి విత్తనాలు కొనుగోలు చేస్తే.. కనీసం ఎకరాకు ఐదుక్వింటాళ్లు కూడా పండే పరిస్థితి లేదని వాపోయారు. పెట్టిన పెట్టుబడి కూడా రాకపోతే తమ పరిస్థితి ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంట కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియని పరిస్థితి ఏర్పడిందని, తమకు ఆత్మహత్యలే శరణ్యమంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి నకిలీ విత్తనాలు విక్రయించిన దుకాణదారులపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

రూ.32 కోట్లతో పంచాయతీ భవనాల నిర్మాణం

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు చోట్ల పంచాయతీ కార్యాలయాలకు నూతన భవనాలు నిర్మించేందుకు పంచాయతీరాజ్ శాఖ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ఆర్‌జీఎస్‌ఎ (రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్) కింద రూ.25 కోట్లు, ఎన్‌ఆర్ ఈజీఎస్ కింద మరో రూ.7 కోట్లు కేటాయించే విధంగా అంచనాలు తయారు చేసి ప్రభుత్వ ఆమోదానికి పంపనున్నారు. ఇప్పటికే జిల్లాలో 27 పంచాయతీ భవనాలు నిర్మాణం చేపట్టేలా జాబితా తయారు చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం నూతన ఎస్‌ఈగా చిన్న సుబ్బరాయుడు బాధ్యతలు చేపడుతుండటంతో.. ఇంజనీర్లు మొత్తం సమావేశమయ్యే అవకాశం ఉంది. అందులో భాగంగా దీనిపై సమీక్షించి తగిన నిర్ణయం తీసుకోనున్నారు. దీంతో జిల్లాలోని పలు పంచాయతీ కార్యాలయాలకు నూతన భవనాలు నిర్మాణం చేపట్టనున్నారు.

బాలికపై అత్యాచారం

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన బాలికపై నరేష్ అనే యువకుడు అత్యాచారానికి ఒడిగట్టాడు. ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇంటి వెనుక వైపున ఉన్న బాలిక ముఖంపై నరేష్ చున్నీతో చుట్టివేసి, అరవకుండా గట్టిగా నోట్లో గుడ్డ కుక్కాడు. ఆ తరువాత బాలికపై అత్యాచారం చేశాడు. బాలిక కోసం తల్లిదండ్రులు వెతుకుతుండగా గమనించిన నరేష్ పరారయ్యాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు నరేష్‌పై పోక్సో, అత్యాచారం కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

టూటౌన్ సీఐను సస్పెండ్ చేయాలి

48 గంటలు న్యాయవాదుల విధుల బహిష్కరణ

అనంతపురం క్రైం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): న్యాయవాదితో దురుసుగా ప్రవర్తించిన, దాడి చేసిన టూ టౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్‌ను సస్పెండ్ చేయాలంటూ న్యాయవాదులు డిమాండ్ చేశారు. గతనెల 29న న్యాయవాది సాయి ప్రసాద్‌తో సీఐ దురుసుగా ప్రవర్తించడంపై సోమవారం జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు గురుప్రసాద్, ప్రధానకార్యదర్శి వెంకట్రాముడు, ఇతర న్యాయవాదులు నిరసనలో పాల్గొన్నారు. ఈసందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయవాది సాయి ప్రసాద్ ఎలాంటి నేరం చేయకుండానే, గత నెల 29వ తేదీ ఎస్పీ క్యాంపు కార్యాలయం వద్ద ఒక నేరస్తుడితో వ్యవహరించినట్లు సీఐ దురుసుగా మాట్లాడారన్నారు. అంతేకాకుండా బలవంతంగా స్టేషన్‌కు తరలించాడన్నారు. న్యాయవాదిలో అమానుషంగా ప్రవర్తించిన సీఐ శ్రీకాంత్ యాదవ్‌ను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. లేకుంటే ప్రైవేట్ కేసు వేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. రెండు రోజులపాటు కోర్టు విధులు బహిష్కరిస్తున్నట్లు తీర్మానం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు నారాయణరెడ్డి, నరసింహులు, ధర్మసింగ్, భీమన్న, నల్లప్ప, గోవిందరాజులు, వేణుగోపాల్ పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

పూలకుంటలో అర్ధరాత్రి చోరీ

6 తులాల బంగారం, రూ.2 లక్షల నగదు అపహరణ

డాగ్‌స్క్వాడ్‌తో పోలీసుల తనిఖీ

గుమ్మఘట్ట, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూలకుంట గ్రామ శివారులో ఆదివారం అర్ధరాత్రి రైతు గంగిరెడ్డి ఇంట్లో దొంగలు చొరబడి ఆరుతులాల బంగారం, రూ. రెండు లక్షల నగదు దోచుకెళ్లారు. గ్రామ శివారులో గంగిరెడ్డి, ఉషారాణి దంపతుల ఇల్లు ఉండగా దొంగలు అర్ధరాత్రి చొరబడి బీరువా పగులగొట్టి అందులోని ఉంగరం, కమ్మలు, ఒక చైనుతో పాటు ఆమె మెడలో మూడు తులాల మంగళసూత్రం సైతం తెంచుకొని పరారయ్యారు. ఇందుకు సంబంధించి గంగిరెడ్డి, ఉషారాణి దంపతులు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం రాత్రి ఉషారాణి ఇంట్లో నిద్రిస్తుండగా.. భర్త గంగిరెడ్డి ఇంటి బయట తలుపులు అడ్డం పెట్టుకొని మంచంపై నిద్రిస్తున్నట్లు తెలిపారు. అర్ధరాత్రి ఉషారాణి గొంతులో మంగళసూత్రం తెంచుతుండగా మెలకువ వచ్చి కేకలు వేయగా ఇద్దరు దొంగలు పారిపోయినట్లు చెప్పారు. ఇంట్లో బీరువా తెరుచుకొని ఉందని, అందులో బంగారు కమ్మలు, ఉంగరం, చైనుతో పాటు కుమారుడి పెళ్లి కోసం దాచి ఉంచిన రూ. రెండు లక్షల నగదు కనిపించలేదని పోలీసులకు వివరించారు. ఘటనపై రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, ఎస్‌ఐ ఈశ్వరయ్యతో పాటు వివిధ మండలాలకు చెందిన ఎస్‌ఐలు, డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీమ్స్‌ను రప్పించి విస్తృత తనిఖీలు చేపట్టారు. దొంగలు వినియోగించిన పాత ద్విచక్రవాహనం గ్రామశివారులో వదిలి పరారైనట్లు డాగ్‌స్క్వాడ్ ద్వారా గుర్తించారు. బండి రికార్డుల ఆధారంగా రంగసముద్రం గ్రామానికి చెందిన ఓ రైతుకు చెందిన వాహనంగా తెలిసింది. పొలం వద్ద వదిలిన వాహనాన్ని దొంగలు చోరీకి వినియోగించినట్లు రైతు పోలీసులకు తెలిపారు. ఆ కోణంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.



వివరాలు ఆరాతీస్తున్న సీఐ

రూ.3 కోట్లు వృథా..!

జగనన్న లేఅవుట్‌లో ప్రజాధనం కుమ్మరింత

కోట్ల రూపాయలతో పనులు

భూమి అనువైంది కాదని ముందుకురాని లబ్ధిదారులు

ఇళ్లు కట్టుకునేందుకు ససేమిరా



లేఅవుట్‌లో నాటిన హద్దుల రాళ్లు



లేఅవుట్‌లో రోడ్లకు వేసిన ఎర్రమట్టిని తీసుకెళ్లిన దృశ్యం

అనంతపురంరూరల్, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): రూపాయి ఖర్చు చేయాలంటే.. ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తారు. అధికారులైతే మరింతగా లెక్కలు వేసి ఖర్చు చేస్తారు. గత వైసీపీ ప్రభుత్వంలో మాత్రం కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేశారు. అనంతపురం రూరల్ మండలం పరిధిలోని కామారుపల్లి సమీపంలో జగనన్న లేఅవుట్‌లో నిధులు కుమ్మరించారు. అప్పటి పాలకుల మెప్పు కోసం.., కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చడానికి కొందరు అధికారులు ప్రజాధనాన్ని మంచి నీళ్లలా ఖర్చు చేశారు. ఇళ్ల నిర్మాణాలకు భూమి అనువైంది కదాని లబ్ధిదారులు అయిష్టత కనబరిచారు. చేసేదిలేక అప్పటి ప్రజాప్రతినిధులు సైతం లేఅవుట్ వద్దనేశారు. దీంతో కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అయింది.

150 ఎకరాల్లో లేఅవుట్

గత ప్రభుత్వంలో కామారుపల్లి వద్ద జగనన్న లేఅవుట్ ఏర్పాటు చేశారు. గ్రామ పరిధి సర్వే నంబర్లు 186, 187, 188,200,201 నుంచి 204, 214 నుంచి 217, 369లో 152.54 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో లేఅవుట్ వేసి పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని అప్పటి పాలకులు, అధికారులు నిర్ణయించారు. ఇసుక, సవుడు భూమి కావడంతో ఇళ్ల నిర్మాణాలకు భూమి అనువైంది కాదన్న అభిప్రాయాలు అప్పట్లోనే వినిపించాయి. అప్పటి ఉన్నతాధికారులు కేవలం ప్రజాప్రతినిధుల మెప్పుకోసం హడావుడిగా పనులు చేశారు. అనంతపురం నగరంతోపాటు మండలంలోని కొన్ని ప్రాంతాల లబ్ధిదారులకు 7,308 ప్లాట్లు కేటాయించారు. ఆ మేరకు పట్టాల పంపిణీ పెద్ద ఎత్తున చేపట్టారు. లబ్ధిదారులు వచ్చి తమకు కేటాయించిన స్థలాలను చూసుకున్నారు. ఇళ్ల నిర్మాణం సాధ్యం కాదనీ, ఒక వేళ చేపట్టినా ప్రభుత్వం ఇచ్చే సొమ్ము పునాదులకు కూడా సరిపోదని తెలియడంతో లబ్ధిదారులు స్థలాలు వద్దనేశారు. ప్రజాప్రతినిధులు చేసేదిలేక లబ్ధిదారులకు ఓటేశారు.

కోట్లు ఖర్చు..

లేఅవుట్ ఏర్పాటుకు అప్పటి అధికారులు ప్రజాధనాన్ని కోట్లలో ఖర్చు చేశారు. లేఅవుట్‌లో ఎర్రమట్టితో రోడ్ల ఏర్పాటుకు ఉపాధి హామీ పథకం కింద రూ.80 లక్షలకు పైగానే ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. విద్యుత్ స్తంభాలు, కరెంటు తీగ, ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రూ.50 లక్షల వరకు ఖర్చు చేసినట్లు సమాచారం. 150 ఎకరాలు చదును చేయడానికి, ప్లాట్ల విభజనకు, హద్దు రాళ్ల నాటేందుకు, ఇతరత్రా వాటికి రూ.కోటికిపైగానే వెచ్చించినట్లు తెలుస్తోంది. మొత్తంగా రూ.3కోట్ల మేర ప్రజాధనాన్ని లేఅవుట్ కోసం వినియోగించారు. ఇంకా నగరంలో నుంచి లేఅవుట్‌కు రావడానికి వందల రుపాయాలు లబ్ధిదారుల ఖర్చయింది.

వైసీపీ నాయకులకే లబ్ధి..

లేఅవుట్‌తో ప్రజలకు ఎలాంటి లబ్ధి చేకూరలేదు. ఇందులో లాభపడింది కాంట్రాక్టర్లే అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అప్పట్లో కాంట్రాక్టును వైసీపీ నాయకులే దక్కించుకుని లాభపడ్డారు. ఇటీవల మరో వైసీపీ నాయకుడు లేఅవుట్‌లోని మట్టిని తరలించి, జేబులు నింపుకున్నాడు. లేఅవుట్‌లో ఉపాధి హామీ పథకం కింద ఎర్రమట్టిని తోలి, రోడ్డు ఏర్పాటు చేశారు. ఆ రోడ్లను పెకలించి, మట్టి తరలించి సొమ్ము చేసుకున్నాడు. ఇది చూసిన జనం ముక్కున వేలేసుకున్నారు. గత ప్రభుత్వంలో లేఅవుట్ కాంట్రాక్టు దక్కించుకుని బాగుపడితే.. ఇపుడు కూడా అదే పార్టీకి చెందిన మరో నాయకుడు రోడ్లకు తోలిన మట్టిన అమ్ముకుని లాభపడుతున్నాడంటూ గ్రామస్థులు చర్చించుకుంటున్నారు.

డైరెక్టర్, కమిషన్ సభ్యులుగా నియామకం

అనంతపురం క్రైం, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలువురు నాయకులకు డైరెక్టర్ పోస్టులు దక్కాయి. సోమవారం టీడీపీ అధిష్ఠానం పలువురికి డైరెక్టర్ పోస్టులను ప్రకటించింది. రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బాలలోకేష్ యాదవ్‌ను నియమించారు. కళ్యాణదుర్గం మండలానికి చెందిన ఓబుళాపురం బాల లోకేష్ యాదవ్‌కు ఈ అవకాశం కల్పించారు. దీంతో ఆయన ఆనందం వ్యక్తం చేశారు. అదేవిధంగా ఏపీ స్టేట్ షెడ్యూల్ ట్రైబ్స్ కమిషన్ సభ్యులుగా శింగనమల మండలం తరిమెల గ్రామానికి చెందిన సాకే అనిల్‌కుమార్‌ను ప్రకటించారు. ఆయన 2009 నుంచి టీడీపీలో పనిచేస్తున్నారు. 2021 నుంచి ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఇప్పుడు ఎస్టీ కమిషన్ సభ్యులుగా ప్రకటించడంతో ఆనందం వ్యక్తం చేశారు.



మంత్రి నారా లోకేశ్‌తో బాలలోకేశ్ యాదవ్, అనిల్‌కుమార్

అన్నదాతలను మింగిన అప్పులు

వేర్వేరుచోట్ల ఇద్దరు రైతుల ఆత్మహత్య



మండ్లి నాగేంద్ర (ఫైల్)

ధర్మవరంరూరల్/తాడిమర్రి, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): అన్నదాతలను అప్పులు మింగేశాయి. ఉమ్మడి అనంత జిల్లాలో వేర్వేరుచోట్ల ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ధర్మవరం మండలం ఆర్.యర్రగుంటపల్లికి చెందిన రైతు మండ్లి నాగేంద్ర (45) సోమవారం రాత్రి విషం తాగి మరణించాడు. రూరల్ పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రైతు నాగేంద్ర తనకున్న ఐదెకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. పొలంలో బోరు తవ్వించడానికి, వేరుశనగ, కాయగూరల పంటల సాగుకోసం సుమారు రూ.10లక్షల వరకు అప్పులు చేసినట్లు కుటుంబీకులు తెలిపారు. పంటలు పండక, అప్పులు తీర్చే మార్గం కనిపించలేదు. దీంతో తీవ్ర మనస్తాపం చెంది ఇంట్లో కుటుంబీకులు లేని సమయంలో విషం తాగి, అపస్మారక స్థితిలో పడిపోయాడు. కాసేపటికి గమనించిన స్థానికులు హుటాహుటిన ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. నాగేంద్రకు భార్య బొజ్జమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

దాడితోటలో కౌలు రైతు..



తలారి రాజగోపాల్ (ఫైల్)

తాడిమర్రి మండలం దాడితోట గ్రామానికి చెందిన కౌలు రైతు తలారి రాజగోపాల్(37) అప్పుల బాధ భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ కృష్ణవేణి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజగోపాల్ గ్రామానికి చెందిన రైతుల భూమిని కౌలుకు తీసుకుని, అరటి సాగు చేశాడు. పంటలు సరిగా పండక అప్పుల పాలయ్యాడు. మరిన్ని అప్పులు చేసి గొర్రెల పెంపకం చేపట్టాడు. అందులో కూడా నష్టాలే ఎదురయ్యాయి. దీంతో అప్పులు రూ.6లక్షలు దాటాయి. వాటిని తీర్చే మార్గం కనిపించక ఆదివారం సాయంత్రం తాను కౌలు చేస్తున్న అరటి తోటలోనే పురుగుల మందు తాగి, ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులకు తోటకెళ్లారు. అక్కడ విగతజీవిగా పడివున్న రాజగోపాల్‌ను చూసి, బోరున విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. రైతుకు భార్య వెంకటలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దివ్యాంగ పింఛన్లపై వైసీపీ తప్పుడు ప్రచారం

● ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

శింగనమల, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): దివ్యాంగ పింఛన్లపై వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారాలకు తెరలేపి రాజకీయం పబ్బం గడుపుకున్నారని.. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. మండలంలోని గుమ్మేపల్లిలో సోమవారం నిర్వహించిన పింఛన్ల పంపిణీలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో అనర్హులకు కూడా దివ్యాంగ పింఛన్లు ఇచ్చారని, వాటిని తొలగించడానికే కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు. అర్హులకు ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. వైసీపీ వారు తప్పుడు ప్రచారం చేసి దివ్యాంగుల్లో ఆందోళనలు రేపారని మండిపడ్డారు. అర్హులకు అన్యాయం జరిగే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఎక్కడైనా ఎవరికైనా ఒకరికో.. ఇద్దరికో.. అన్యాయం జరిగి ఉంటే మరోసారి అప్పీల్‌కు కూటమి ప్రభుత్వం అవకాశం ఇచ్చిందని చెప్పారు. తర్వాత గుమ్మేపల్లి పంచాయతీ సోలార్ రూఫ్ టాప్ ఆదర్శ పంచాయతీగా ఎంపిక కావడంతో గ్రామంలోనే సర్పంచ్ దేగల లలితమ్మ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. సూర్య ఘర్ యోజన పథకం ద్వారా గుమ్మేపల్లి పంచాయతీని సోలార్ రూఫ్ టాప్ హబ్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు. సోలార్ రూఫ్ టాప్ పథకానికి సీఎం చంద్రబాబు 20 ఏళ్ల భవిష్యత్తు కోసం ప్రణాళికతో ప్రజలకు సబ్సిడీతో బ్యాంకు రుణాలు ఇప్పించనున్నట్లు చెప్పారు. ఈ సోలార్ పథకం ద్వారా విద్యుత్ బిల్లు తగ్గించుకోవచ్చునని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి దేగలకృష్ణమూర్తి, నాయకులు మారుతీనాయుడు, దేగల శ్రీనివాసులు, బోయసత్తి,మాసూల చంద్ర, గుర్రంలక్ష్మీనారాయణ, ఎంపీడీఓ భాస్కర్,డిప్యూటీ ఎంపీడీఓ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దళితుడికి న్యాయం చేయాలంటూ రిలే దీక్ష

గార్లదిన్నె, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం దళితుడికి కేటాయించిన భూమి విషయంలో అధికారులు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... ముకుందాపురం గ్రామానికి చెందిన జెన్నె వన్నూరప్పకు 1983లో ప్రభుత్వం 5.48 ఎకరాల భూమిని ఇచ్చిందన్నారు. అయితే అతను అదే గ్రామానికి చెందిన భూస్వామి ఇంట్లో పాలేరుగా పనిచేసే సమయంలో అవసరం నిమిత్తం కొంత డబ్బును అప్పుగా తీసుకున్నారని, అయితే ఆ అప్పునకు వన్నూరప్ప భూమిని భూస్వామి తమ పేరు మీద ఆన్‌లైన్లో ఎక్కించుకున్నారని అన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి దళితులకు చెందాల్సిన భూమిని దళితులకే కేటాయించాలని కోరారు. ఈ విషయంలో ఇదివరకే చాలాసార్లు బాధిత రైతు అధికారులు మొరపెట్టుకున్నారని, ఎవరూ పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా స్పందించాలన్నారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం నాయకులు నాగరాజు, శివారెడ్డి, నాగార్జున, నాగమ్మ పాల్గొన్నారు.

ఆరు వినతులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): అనంత నగరపాలక సంస్థలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్య పరిష్కారవేదికలో ఎస్ఈ రాజశేఖర్, టౌన్‌ప్లానింగ్ ఇన్‌చార్జి శిరీష, మేనేజర్ ఖయ్యూం ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. విద్యుత్తుదీపాలు, రోడ్ల నిర్మాణం, శానిటేషన్ సమస్యలు పరిష్కరించాలని ప్రజలు మొత్తం ఆరు వినతులు అందించారు. అనంతరం ఎస్ఈ రాజశేఖర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వినతుల ద్వారా వచ్చిన ప్రతి సమస్యను సకాలంలో పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

ఆ నియామకాలను విరమించాలి: ఎస్టీయూ

అనంతపురం విద్య, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): ఏపీ మోడల్ స్కూళ్లలో సబ్జెక్టు టీచర్లు లేని చోట తాత్కాలిక సర్దుబాటు పేరుతో మోడల్ స్కూల్ టీచర్లను డిప్యుటేషన్‌లో నియమించడం విరమించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధానకార్యదర్శి రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో సోమవారం వారు డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మోడల్‌స్కూల్‌టీచర్లు బాలిరెడ్డి,యాదవమూర్తి, రాజారెడ్డి, మోహన్,మధుసూదన్, నాగరాజు, రమాదేవి పాల్గొన్నారు.

ఘనంగా ఎల్ఐసీ వారోత్సవాలు

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ 69వ వారోత్సవాలను నగరంలోని బ్రాంచ్ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎల్ఐసీ ఏజెంట్స్ ఫెడరేషన్(లియాఫీ) ప్రధాన కార్యదర్శి చెరుకుతోట జగదీష్, బ్రాంచ్ మేనేజర్ భరత్ మాట్లాడుతూ.. పాలసీదారులకు సురక్షతమైన సేవలు అందించడమే ఎల్ఐసీ లక్ష్యమని తెలిపారు. పాలసీదారులకు సకాలంలో చెల్లింపులు, రుణాలు తదితర సేవలు అందిస్తున్న ఏకైక సంస్థ ఎల్ఐసీ అన్నారు. అనంతరం కేక్‌ను కట్‌చేశారు. కార్యక్రమంలో ఏఓ వెంకటేష్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ల పంపిణీ

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో 74 వార్డు సచివాలయాల పరిధిలో సోమవారం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఏఎంసీ కమిషనర్ బాలస్వామి ఆధ్వర్యంలో సచివాలయాల ఉద్యోగులు ఉదయం నుంచే పింఛన్ల పంపిణీ చేపట్టారు. 69వ సచివాలయ పరిధిలో ఏపీ లింగాయత్ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ స్వప్న ఉద్యోగులతో కలిసి ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ అందజేశారు.

●అనంతపురంరూరల్: మండలంలోని కక్కలపల్లి పంచాయతీ పరిధిలో రాప్తాడు మార్కెట్ యార్డు చైర్మన్ బోయపాటి సుధాకర్, టీడీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది కలిసి సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు నారాయణస్వామి, సీనియర్ నాయకులు బండి నరసింహులు, రాజు రాయల్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

●ఆత్మకూరు: మండలంలో గ్రామ గ్రామాన టీడీపీనాయకులు, అధికారులు పింఛన్లను లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పంపిణీ చేశారు. మండలకేంద్రంలో మండల కన్వీనర్ శ్రీనివాసులు, వడ్డుపల్లిలో దివ్యాంగుల, వృద్ధపౌరుల సహాయ కార్పొరేషన్ చైర్మన్ నారాయణస్వామి పింఛన్లు అందజేశారు.

చిత్రావతి అతిథి భవనం ప్రారంభం


అతిథి భవనాన్ని ప్రారంభిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని చిత్రావతి అతిథి భవనాన్ని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ సోమవారం ప్రారంభించారు. ఇంతకుమునుపు అతిథి భవనం శిథిలావస్థకు చేరడంతో తిరిగి వినియోగంలోకి తీసుకరావడంలో భాగంగా మరమ్మతు పనులు చేపట్టారు. దీంతో పనులు పూర్తి కావడంతో ఆ భవనాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. భవనం అందరికీ అందుబాటులో ఉండేలా రుసుము విధించడం జరిగిందన్నారు. తగిన రుసుము చెల్లించి అతిథి భవనాలను వినియోగించుకోవచ్చునని తెలిపారు. అతిథి భవనాల నిర్వాహణ గాలికి వదిలేయకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలని , ఇందుకు తగిన సిబ్బందిని నియమించాలని అధికారులను ఆదేశించారు. జడ్పీ సీఈఓ శివశంకర్, డీఈ లక్ష్మీనారాయణ, ఏఈ వెంకటశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర గ్రామీణాభివృద్ధికి చర్యలు: కలెక్టర్


లబ్ధిదారులతో కలిసి గోకులం షెడ్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం రూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): సమగ్ర గ్రామీణాభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. మండలంలోని చియ్యేడు గ్రామంలో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ ఉపాధి హామీ పథకం కింద రూ.2.30లక్షల వ్యయంతో నిర్మించిన గోకులం షెడ్‌ను ప్రారంభించారు. అలాగే చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద మొక్కలు నాటారు. అక్కడే నాడప్ పిట్స్‌ను ప్రారంభించి వాటిల్లో నీరు నింపేందుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇక రైతు సేవాకేంద్రం వద్ద ఉపాధి హామీ కింద రూ.35వేలతో నిర్మించిన పశువుల నీటి తొట్టెను ప్రారంభించారు. అలాగే ఎండోమెంట్ భూమితో పాటు విలేజ్ క్లినిక్ వద్ద రూ.75వేలతో ఏర్పాటు చేసిన రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్‌ను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం కింద మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. సమగ్ర గ్రామీణాభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఉపాధి పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో సర్పంచు గంగాధర్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు లక్ష్మినారాయణ, డీఆర్‌డీఏ పీడీ శైలాజా, డీపీఓ నాగరాజు నాయుడు, జడ్పీ సీఈఓ శివశంకర్, డ్వామా పీడీ సలీంబాషా, ఎంపీడీఓ దివాకర్, తహసీల్దార్ మోహన్‌కుమార్, టీడీపీ నాయకుడు సాయినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

అనంతపురం కలెక్టరేట్: ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం ద్వారా ప్రజల నుంచివినతుల రూపంలో వచ్చిన సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదని, వెంటనే వాటిని పరిష్కరించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆయన జేసీ శివనారాయణ శర్మ,అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్‌తో కలిసి ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. అంతకుముందు వివిధ అంశాలపై అధికారుల సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ.. పీజీఆర్ఎస్‌లో వచ్చిన సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. తాను క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు పీజీఆర్ఎస్‌లో ఎక్కువగా మండలస్థాయి అధికారులు గైర్హాజరవుతున్నట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. భూ సమస్యల పరిష్కారం, పింఛన్ల మంజూరు, ఇంటి స్థలాలు, రేషన్ కార్డులు తదితర అంశాలతో కూడిన వినతులు సుమారు 390 దాకా వచ్చాయి. కార్యక్రమంలో డీఆర్ఓ మలోల తదితరులు పాల్గొన్నారు.

యూరియాను అధిక మోతాదులో వాడరాదు

యూరియాను అధిక మోతాదులో వాడరాదని, వాడేటప్పుడు తగిన సూచనలు పాటించాలని కలెక్టర్ రైతులకు సూచించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో యూరియా మోతాదుకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రైతులు యూరియాను వాడే సమయంలో అందులో నత్రజని వినియోగ సామర్థ్యాన్ని పెంచడానికి, వివిధ రూపాల ద్వారా జరిగే నష్టాన్ని తగ్గించడానికి వ్యవసాయశాఖ తెలిపిన సూచనలు పాటించాలన్నారు. ప్రతి 5కిలోల యూరియాకు కిలో వేప పిండి కలిపి వాడితే నీటిలో కరిగే శాతం తగ్గి నత్రజని ఎక్కువ కాలం పంటకు అందడంతో పాటు చీడ పీడల ఉధృతి కూడా కొంతవరకు తగ్గుతుందని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబు.. నా రాజకీయ గురువు: ఎమ్మెల్యే సునీత


కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురంక్రైం, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు తనకు రాజకీయ గురువని, గతంలో ఆయన మంత్రి వర్గంలో మంత్రిగా పని చేయడం ఆనందంగా ఉందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. మొదటిసారి చంద్రబాబు సీఎం బాధ్యతలు చేపట్టి 30 ఏళ్లు పూర్తి చేసుకోవడంపై అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆమె రాప్తాడు నియోజకవర్గ నియోజకవర్గ నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. తెలుగు నేలపై నాలుగు సార్లు సీఎంగా పనిచేసిన ఏకైక వ్యక్తి చంద్రబాబేనని తెలిపారు. ఎన్నో సంక్షోభాలు, ఆటుపోట్లు ఎదురైనా.. తన చాణిక్యతతో విజయం సాధించారని కొనియాడారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

రాప్తాడు నియోజకవర్గంలోని అనంతపురం రూరల్, చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి, రామగిరి మండలాలకు చెందిన ఐదుగురికి రూ. 2.76లక్షల మేర సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. అందుకు సంబంధించిన చెక్కులను అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీత లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

రైతు సమస్యలు పరిష్కరించాలి

శింగనమల, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నప్పయాదవ్ కోరారు. రైతాంగ కోర్కెల దినం సందర్భంగా మండలకేంద్రంలో సోమవారం ఆయన రైతు సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. రైతుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. ఇప్పటికైనా మేల్కొని పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. లేదంటే రైతు సంఘం ఆధ్వర్యంలో పోరాడుతామని హెచ్చరించారు. క్యాక్రమంలో నాయకులు నేసే మధు, నారప్ప బాషా, బండి వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

శింగనమల,సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. సర్పంచులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

పౌష్టికాహార వారోత్సవాలు

నార్పల,సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని సుల్తాన్‌పేట-1 అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పౌష్టికాహార వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డీవీ నారాయణమ్మ, ఆరోగ్య సిబ్బంది అక్కులప్ప మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తప్పక తీసుకోవాలని సూచించారు. చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మేయర్ల సదస్సుకు వసీం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హర్యానాలో ఈ నెల 2, 3 తేదీల్లో జరిగే అఖిలభారత మేయర్ల సదస్సుకు అనంత నగర మేయర్ వసీం హాజరుకానున్నారు. హర్యానాలోని కర్నాల్‌లో నిర్వహించే ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్ల 53వ సదస్సుకు వసీంకు ఆహ్వానం అందింది. కార్యక్రమానికి వెళ్లి అనంత నగర అభివృద్ధిపై చర్చిస్తానని వశీం సోమవారం తెలిపారు.

'వాల్మీకులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి'

అనంతపురంరూరల్, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): వాల్మీకి ప్రజాప్రతినిధులు వాల్మీకి బోయలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని రుద్రంపేట సర్కిల్లో గల వాల్మీకి కల్యాణ మండపంలో సోమవారం సంఘం అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల అధ్యక్షులు మాధవయ్య, రమేష్ విలేకరులతో మాట్లాడారు. వాల్మీకి బోయలను ఎస్టీల్లో చేర్చడంపై ఈనెల 3వతేదీన వాల్మీకి ప్రజాప్రతినిధులైన కాలవ శ్రీనివాసులు, అంబికా లక్ష్మీనారాయణ ఇళ్లను ముట్టడిస్తామని తెలిపారు. ఏడాది కిందట ఇదే కల్యాణ మండపంలో వాల్మీకి ప్రజాప్రతినిధులు, నాయకులను వాల్మీకి జాతికి న్యాయం చేయాలని కోరామన్నారు. అప్పుడు మాట ఇచ్చిన నాయకులు, ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లోనైనా వాల్మీకులను ఎస్టీల్లో చేర్చడంపై చర్చ జరగాలన్నారు. లేని పక్షంలో అసెంబ్లీ ముట్టడికి కూడా వెనకాడబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యాక్షుడు కేశవ, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి నరేష్, నాయకులు భాస్కర్, నాగేంద్ర, పెద్దన్న, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

డీపీఓ కార్యాలయంలో ఇద్దరికి ఉద్యోగోన్నతి

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ కార్యాలయంలో పని చేసే ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ డీపీఓ నాగరాజనాయుడు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అందులోభాగంగా డీపీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా సాకే భారతిని, ధర్మవరం డీఎల్‌పీఓ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్‌గా వెంకటస్వామిని నియమించారు. మొదట్లో జూనియర్ అసిస్టెంట్లుగా ఉన్న వెంకటస్వామి, శాలినికి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించాలని జాబితా తయారు చేశారు. అయితే రోస్టర్‌లో తప్పిదాలు జరిగాయని కలెక్టర్ దృష్టికి వెళ్లింది. దీంతో కలెక్టర్ చీవాట్లు పెట్టడంతో మరో వారం రోజులు దీనిపై కసరత్తు చేసి జాబితాలో మార్పులు చేసి చివరికి ఉద్యోగోన్నతుల జాబితా విడుదల చేశారు. శాలిని ప్రమోషన్‌కు తనకు అర్హత ఉందని, తగిన న్యాయం జరిగేలా చూడాలని ఎస్సీ కమిషన్‌ను సంప్రదించినట్లు తెలిసింది. కాగా అధికారులు పూటకు ఒక జాబితా తయారు చేసి విడుదల చేస్తుండటంతో పలు అనుమానాలకు దారి తీస్తోంది.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ఆత్మకూరు సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పార్టీ నాయకులు క్షీరాభిషేకం చేశారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. చంద్రబాబు తొలిసారి సీఎంగా బాధ్యతలు చేపట్టి నేటికి 30 సంవత్సరాలు పూర్తయ్యాయని, అందుకు ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్‌ను కలిసిన టీడీపీ నాయకులు


మంతెన సత్యనారాయణ రాజుతో ఆలం నరసానాయుడు

అనంతపురం క్రైం, సెప్టెంబరు1 (ఆంధ్ర జ్యోతి): ముఖ్యమంత్రి కార్యక్రమాల కో-ఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజును టీడీపీ నాయకులు కలిశారు. జిల్లాకేంద్రానికి సోమవారం వచ్చిన మంతెన సత్యనారాయణ రాజు, గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్రను టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. మంతెన సత్యనారాయణ రాజును ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవ రెడ్డి కూడా కలిశారు.

బీసీలకు 44శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి


మాట్లాడుతున్న నాగరాజు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీలకు చట్టసభల్లో, స్థానిక సంస్థలలో, విద్యా, ఉద్యోగాలలో, ప్రైవేటు, కార్పొరేట్ రంగాల్లో 44శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఆర్‌పీఎస్ వ్యవస్థాపకులు పోతుల నాగరాజు కోరారు. నగరంలోని ఆర్‌పీఎస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీసీలకు 44శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ అన్ని రాజకీయ పార్టీల నేతలకు లేఖలు రాసినట్లు తెలిపారు. ముఖ్యంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్‌కు ప్రత్యేకం లేఖ రాశామన్నారు. మీ నాయకత్వంలో తెలుగుదేశం ఒక బలమైన పార్టీగా రూపాంతరం చెందుతున్న సందర్భంలో బీసీలకు 44శాతం రిజర్వేషన్లపై స్పందించాలని కోరామన్నారు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వంలో కీలకంగా ఉన్న టీడీపీ చొరవ చూపి నందమూరి తారక రామారావు ఆశయాలకు అనుగుణంగా బీసీలకు రిజర్వేషన్లు కల్పించడంపై న్యాయం చేయాలని లేఖ లో కోరారు. కార్యక్రమంలో ఆర్‌పీఎస్, ఆర్ఈఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేసి.. ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

● నల్లబ్యాడ్జీలతో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల నిరసన


నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేసి.. ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు.. ఓపీఎస్ కావాలి అనే నినాదంతో విజయవాడలో చేపట్టిన ధర్నాకు మద్దతుగా సోమవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రామ వార్డు సచివాలయాల ఎదుట వారు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ క్రమంలో నగరంలోని గౌరవ్‌గార్డెన్స్‌లో గల 69వ సచివాలయం ఎదుట నిర్వహించిన నిరసనలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ..సీపీఎస్ వద్దు..ఓపీఎస్ ముద్దు అనే నినాదంతో ప్రభుత్వానికి తమ సమస్యను తెలియజేస్తున్నామని తెలిపారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి 2004 కంటే ముందు ఉన్న పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. సీపీఎస్ విధానంతో ప్రభుత్వ ఉద్యోగులకు రిటైర్మెంట్ తరువాత పెన్షన్ అందక కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. సీపీఎస్ రద్దు చేసి ఓల్డ్ పెన్షన్ స్కీమ్‌ను తిరిగి పునరుద్ధరించి ప్రభుత్వ ఉద్యోగులను ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని ఉమ్మడి జిల్లాలోని అన్ని గ్రామ వార్డు సచివాలయాల ఎదుట నిర్వహించామని తెలిపారు. జేఏసీ నాయకులు సుధాకర్, వీ. లక్ష్మినారాయణ, శివశంకర్, వీరనారప్ప, మల్లికార్జున, సిరాల చంద్ర, రామకృష్ణ, మంజునాథ్, జానకిరమేష్, హారతి, సావిత్రిబాయి, రెహానా, జెబీనా, సమీనా, కృష్ణారెడ్డి, సందీప్ పాల్గొన్నారు.

జనం సొమ్మును వృథా చేసిన జగన్

● పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే దగ్గుపాటి ఫైర్


చంద్రబాబు కాలనీలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

అనంతపురం క్రైం, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో అప్పటి సీఎం జగన్ రాచరిక పాలన సాగించి జనం సొమ్మును వృథా చేశారని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మండిపడ్డారు. నగరంలోని 9, 31వ డివిజన్లతో పాటు రుద్రంపేట పంచాయతీ చంద్రబాబు కాలనీలో సోమవారం ఆయన టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామితో కలిసి పింఛన్‌దారులకు పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో జగన్ జనం సొమ్ము రూ.500 కోట్లు ఖర్చు చేసి విశాఖలోని రిషికొండలో ప్యాలెస్ కట్టించారన్నారు. దీని మెయింటెనెన్స్‌కి సైతం ప్రతినెలా సుమారుగా ఖర్చు వస్తోందన్నారు. ఈ సొమ్ము అంతా వృథా అవుతున్నట్లు మండిపడ్డారు. ప్రజలకు ఉపయోగపడే పనులు చేసింటే బాగుండేదని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే ఐదు కీలక హామీలు నెరవేర్చారన్నారు. ఏడాదిలోనే రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చారన్నారు. 10 లక్షల ఉద్యోగాలు కూడా తెచ్చారని, ఇందులో మంత్రి లోకేష్ పాత్ర ఎంతో ఉందని గుర్తుచేశారు. వచ్చేనెల 2వ తేదీకి డంపింగ్ యార్డులో పూర్తిగా చెత్తను తొలగిస్తామని, డంపింగ్‌యార్డును కూడా తరలించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఏఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుల ఏకగ్రీవం


స్టాండింగ్ కమిటీ సభ్యులతో ఏఎంసీ సెక్రటరీ రంగస్వామి, మేయర్ వసీం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): అనంత నగరపాలక సంస్థలో స్టాండింగ్ కమిటీ సభ్యుల కోసం ఐదు నామినేషన్లు రావడంతో ఏకగ్రీవం చేశారు. నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, సెక్రటరీ రంగస్వామి ఇచ్చిన ఎన్నికల నోటిఫికేషన్ ప్రకారం ఐదుగురు సభ్యులుగా ఉండే స్టాండింగ్ కమిటీకి ఐదుగురు కార్పొరేటర్లు మాత్రమే నామినేషన్లు వేశారు. ఆ ఐదుగురిలో 15వ డివిజన్ కార్పొరేటర్ మల్లికార్జున, 5వ డివిజన్ కార్పొరేటర్ కే. జయలత, 20వ డివిజన్ కార్పొరేటర్ లావణ్య, 9వ డివిజన్ కార్పొరేటర్ ఎం.దేవి, 11వ డివిజన్ కార్పొరేటర్ రామాంజినమ్మ ఉన్నారు. ఒకవేళ ఎన్నికలు జరిగితే షెడ్యూల్ ప్రకారం.. సోమవారం నామినేషన్ల ఉపసంహరణకు చివరి గడువుగా నిర్ణయించారు. ఐదుగురు మాత్రమే నామినేషన్ వేయ డం, ఎవరూ ఉపసంహరించుకోకపోవడంతో ఏకగ్రీవం చేసినట్లు ఎన్నికల అధికారి ఏఎంసీ సెక్రటరీ రంగస్వామి తెలిపారు. ఏడాది పాటు స్టాండింగ్ కమిటీ సభ్యుల పదవీకాలం ఉంటుంది. స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన వారిని మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య అభినందించారు.

'ఈపీటీఎస్‌లో వృద్ధిని సాధిద్దాం'


అధికారులతో డాక్టర్ ఆత్మారామ్

అనంతపురం వైద్యం, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మార్గదర్శకాలను అమలు చేయడంలో ముందున్నామని, ఇంకాస్త మెరుగ్గా పనిచేసి ఎలక్ట్రానిక్ పర్ఫార్మెన్స్ అండ్ ట్రాకింగ్ సిస్టం (ఈపీటీఎస్)లో కూడా వృద్ధిని సాధిద్దామని ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారామ్ అధికారులను కోరారు. అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జున రెడ్డి, అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ సౌజన్యకుమార్‌తో కలిసి సోమవారం ఆయన కార్యాలయ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. కలెక్టర్ వినోద్ కుమార్ ఈపీటీఎస్ పూర్తిస్థాయి అమలును లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. ప్రతి ఉద్యోగి తనకు వచ్చిన ఫైళ్లను ఈపీటీఎస్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. మరోవైపు ప్రభుత్వ జీఓలు, ప్రొసీడింగ్స్, కరెస్పాండింగ్ లెటర్స్, హెచ్‌డీఎస్ రెజ్యులేషన్స్, టెండర్, జాబ్ డాక్యుమెంట్స్ తదిర అంశాలకు సంబంధించిన పనులు సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యాలయ సూపరింటెండెంట్లు మక్బుల్ అహ్మద్, ఉదయ్‌కుమార్, జంబునాథ్‌తోపాటు సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎన్టీఆర్, రవీంద్ర విగ్రహాలు ఏర్పాటు చేస్తాం

రాప్తాడు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో త్వరలో ఎన్టీఆర్, పరిటాల రవీంద్ర విగ్రహాలను ఏర్పాటు చేస్తామని టీడీపీ మండల ఇన్‌చార్జి ధర్మవరపు మురళి తెలిపారు. ఇందుకు గాను సోమవారం స్థానిక టీడీపీ నాయకులతో స్థలాన్ని పరిశీలించారు. జాతీయరహదారి పక్కన, ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పరిశీలించారు. అనంతరం మురళి మాట్లాడుతూ.. విగ్రహాల ఏర్పాటుకు ఈనెల 4వతేదీ ఉదయం 9 గంటలకు భూమి పూజ చేస్తామన్నారు. జనవరి 24న పరిటాల రవీంద్ర వర్ధంతి సందర్భంగా విగ్రహాల ఆవిష్కరణ నిర్వహిస్తామని తెలిపారు. మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సర్పంచ్‌లు తిరుపాలు, శీనయ్య, ఉజ్జినప్ప, నరేష్, ఎంపీటీసీ జాఫర్, సొసైటీ చైర్మన్లు మరూరు గోపాల్, బ్రహ్మానందరెడ్డి, గంగలకుంట రమణ, సాకే జయరాముడు, కిష్టా తదితరులు పాల్గొన్నారు.

పాలికేక పోస్టర్ల విడుదల

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పేదలకు అనేక సేవలందించిన ఆర్డీటీకి కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ చేయకపోవడం దారుణమని ఎస్సీ, ఎస్టీ అఖిలపక్ష కమిటీ నాయకులు బీసీ ఆర్ దాస్, డాక్టర్ అక్కులప్ప, సాకేహరి, యల్లన్న, నారాయణస్వామి సోమవారం మండిపడ్డారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏను రెన్యువల్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15వ తేదీన నగరంలో పాలికేక చేపడుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగా స్థానిక ఆర్ట్స్ కళాశాల నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నామని, ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. అనంతరం ఈ మేరకు కమిటీ ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు. నాయకులు రాజు, ఉదయ్, దొడ్డప్ప, కుళ్లాయప్ప, నూరి, ఉమామహేశ్వరి, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ల సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

అనంతపురం టౌన్, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా పాస్టర్ల సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నికైంది. జిల్లా కేంద్రంలోని పాపంపేటలో గల షారోన్ ఆరాధన మందిరంలో సోమవారం సాయంత్రం జిల్లాలోని పాస్టర్లు సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఎన్నిక చేశారు. అధ్యక్షుడిగా రెవరెండ్ డాక్టర్ యేషయా, ఉపాధ్యక్షుడిగా రెవరెండ్ డాక్టర్ అనిల్‌కుమార్, కార్యదర్శిగా వరప్రసాద్, సహాయ కార్యదర్శిగా కురియన్ డానియేలు, కోశాధికారిగా ఆడమ్, కార్యవర్గ సభ్యులుగా డేవిడ్‌రాజ్, రాజశేఖర్, జీవరత్నం, డేనియల్ కొండయ్యను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ.. పాస్టర్ల సంక్షేమానికి శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. అనంతరం షారోన్ ఆరాధన మందిరం ఆధ్వర్యంలో క్రైస్తవులందరికీ ప్రేమవిందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రెవరెండ్ తిమోతిరావు, రెవరెండ్ డాక్టర్ రఘునాథ్ డేనియల్, నెహమ్యా నాయక్, సచార్, ప్రతాప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పాస్టర్ల సంక్షేమ సంఘం నూతన కమిటీ సభ్యులు

న్యూస్ బాక్స్

ఘనంగా మారమ్మదేవి రథోత్సవం



అమ్మవారి రథాన్ని లాగుతున్న భక్తులు

కణేకల్లు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కణేకల్లు క్రాసింగ్‌లో వెలసిన మారమ్మదేవి రథోత్సవం సోమవారం సాయంత్రం ఘనం గా నిర్వహించారు. ఉదయం నుండే ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపి భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో అలంకరించి గ్రామ పురవీధులలో ఊరేగించారు.

కలెక్టర్‌కు గాంధీజీ చిత్రపటం అందజేత



కలెక్టర్‌కు గాంధీ చిత్రపటాన్ని అందజేస్తున్న కోట సంరక్షణ సమితి నాయకులు

గుత్తి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుత్తికోట సంరక్షణ సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్‌కు గాంధీజీ పెయింటింగ్ చిత్రపటాన్ని సోమవారం అందజేసినట్లు సమితి అధ్యక్షుడు విజయ్‌భాస్కర్ తెలిపారు. చీరాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు రవి గీసిన గాంధీ అపూరూప చిత్రపటాన్ని అప్పటి కోట పరిపాలకులు మురారి రావు గోర్పాడే వంశస్థులు ఇంద్రజిత్ గోర్పాడే ముద్రించిన ప్రముఖ నవల రచయిత్రి రీటా రామ్మూర్తి గుప్త రాసిన పుస్తకాన్ని కలెక్టర్ కార్యాయలంలో కలెక్టర్‌కు అందజేశారు. జిల్లా పర్యటక సాంస్కృతిక అధికారి జయకుమార్, సమితి నాయకులు బాలమురళీకృష్ణ, సాధుశేఖర్, సూర్యనారాయణ, రంగస్వామి, తదితరులుపాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో ఉపాధి పనులు పరిశీలించాలి



మాట్లాడుతున్న విజిలెన్స్ జిల్లా అధికారి శ్రీనివాసులు

రాయదుర్గంరూరల్, సెప్టెంబర్ 1(ఆంధ్రజ్యోతి): ఎన్ఆర్ఈజీఎస్ పీఆర్ శాఖ కింద కూలీలు చేసిన ప్రతి ఉపాధి హామీ పనిని క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక అందించాలని సామాజిక తనిఖీ బృందం సభ్యులకు జిల్లా విజిలెన్స్ అధికారి శ్రీనివాసులు కోరారు. సోమవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సామాజిక తనిఖీ బృందంతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో ఉపాధిహామీ పథకం పంచాయతీరాజ్ శాఖలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన రూ.14.75 కోట్ల విలువైన పనులను పరిశీలించి నివేదిక అందించాలని ఆయన కోరారు. జేఈ వెంకటరమణ, ఎంపీడీఓ కొండన్న, ఏపీఓ రవి, ఏపీడీ అసిస్టెంట్ దేవరాజ్, సామాజిక తనిఖీ బృందం స్టేట్ కో-ఆర్డినేటర్ నీలకంఠయ్య పాల్గొన్నారు.

ఎస్‌డీఎల్‌సీఓగా మల్లరాయుడు



మల్లరాయుడును సన్మానిస్తున్న బ్యాంక్ సిబ్బంది

రాయదుర్గంరూరల్, సెప్టెంబర్ 1(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం సబ్ డివిజన్ సహకార బ్యాంక్ ఎస్‌డీఎల్‌సీఓగా మల్లరాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కార్యాలయంలో సీనియర్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తూ సహకార సంఘ రాయదుర్గం సబ్‌డివిజన్‌లో ఎస్‌డీఎల్‌సీఓగా నియమితులయ్యారు. స్థానిక బ్యాంక్ మేనేజర్ ఫణిభూషణ్, సూపర్‌వైజర్ జయరాములు, వివిధ సొసైటీల సీఈఓలు శ్రీనివాసులు, రమణారెడ్డి, మోహన్ మంగళం, దాదాపీర్, బసవరాజు, మోహన్‌రెడ్డి, ఆంజనేయులు ఆయనను సన్మానించారు.

అన్నదానం



భోజనం వడ్డిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి గుమ్మనూరు నారాయణస్వామి

గుంతకల్లుటౌన్,సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): మిలాద్ ఉన్ నబీ పండుగను పురస్కరించుకుని పట్టణంలోని అంజుమన్ వీధిలో సోమవారం అంజుమన్ ఏ ఇస్లామియా కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. మధ్యాహ్నం కమిటీ సభ్యులు ప్రత్యేక ప్రార్థనలు, చదవింపులు చదవించారు. కార్యక్రమానికి టీడీపీ ఇన్‌చార్జి గుమ్మనూరు నారాయణస్వామి, సింగిల్ విండో చైర్మన్ తలారి మస్తానప్ప, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ శ్రీనాథ్‌గౌడ్, పవన్‌కుమార్ గౌడ్, అనిల్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి దౌల్తాపురం ప్రభాకర్, బీజేపీ నాయకులు కొలిమి రామాంజనేయులు హాజరై భోజనం వడ్డించారు. కమిటీ అధ్యక్షుడు సయ్యద్ జాఫర్, సభ్యులు కే వలీబాషా, బాషా, షెక్షావలి, అఫ్రోజ్‌ఖాన్, మన్ను, అష్రఫ్, నూరు, ఫజులు, ఫ్రూట్‌మస్తాన్, ఆటోఖాజా, నందీశ్వర్, అంజి, హనమంతు, గుజిరీ మహ్మద్‌ఖాజా పాల్గొన్నారు.

హామీలను మరచిన సీఎం చంద్రబాబు

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత

పుట్లూరు, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): మోసపు హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు ఇప్పుడు వాటిని మరిచిపోతున్నారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఆరోపించారు. మండలకేంద్రంలో సోమవారం నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రీకాల్ చంద్రబాబు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అపద్ధపు హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చాక అడిగితే నాలుక మందం అయిందని చెప్పడం దారుణమన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు ప్రజల తరపున పోరాడుతామన్నారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, మండల కన్వీనర్ మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న వైసీపీ నేతలు

వైసీపీ విష ప్రచారాన్ని తిప్పికొట్టండి

● ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు



లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేస్తున్న విప్ కాలవ

రాయదుర్గం, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): అర్హుల పింఛన్లు ప్రభుత్వం తొలగిస్తోందన్న వైసీపీ విష ప్రచారాన్ని నమ్మవద్దని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. పట్టణంలో సోమవారం ఆయన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పింఛన్ల విషయంలో అనేక ఫిర్యాదులె అందడంతో వాటిని పరిశీలించేందుకు ప్రభుత్వం ఆదేశించిందన్నారు. క్షుణ్ణంగా తనిఖీ చేశాక అర్హులందరికీ పెన్షన్లను కొనసాగిస్తుందన్నారు. ఈ విషయాన్ని వైసీపీ కప్పిపెట్టి అర్హుల పెన్షన్లను కూటమి ప్రభుత్వం తొలగిస్తోందన్న దుష్ప్రచారం చేస్తోందన్నారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం వీలైనమేరకు ఎక్కువ మందికి పింఛన్లు అందించేందుకు కృషి చేస్తుందన్నారు. కొత్తగా మరింత మంది అర్హులకు ఇవ్వాలన్నదే సీఎం లక్ష్యమన్నారు. దేశంలో సామాజిక పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టింది ఎన్టీఆరేనని వెల్లడించారు. పేదల పొట్టకొట్టి ప్రభుత్వ సొమ్మును దోచేసిన జగన్‌కు ఆ పార్టీ నాయకులకు మాట్లాడే అర్హత లేదన్నారు. అరాచక పాలన నుంచి రాష్ట్రాన్ని చంద్రబాబు గట్టు ఎక్కిస్తూ అభివృద్ధి దిశగా పయనింపచేస్తున్నారన్నారు. నేడు రాష్ట్ర ప్రగతి కోరుకునే ప్రతి ఒక్కరూ చంద్రబాబు పాలన కోరుకుంటూ ఆశీర్వదిస్తున్నారని స్పష్టం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చంద్రబాబు ఉజ్వల భవిష్యత్తును ఇచ్చారని అన్నారు. సీఎంగా బాధ్యతలు చేపట్టి 30 వసంతాలు పూర్తి చేసుకున్నందుకు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

'అర్హులందరికీ పింఛన్'

డీ.హీరేహాళ్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగళ్లి రాజు అన్నారు. సోమవారం మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో 90 శాతంపైగా పింఛన్ల పంపిణీ పూర్తి చేశారన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నాలుగైదు రోజులుగా వైసీపీ సోషల్ మీడియా తదితర మాధ్యమాలలో పింఛన్లు తొలగించారని విషప్రచారం మొదలుపెట్టారన్నారు. నేడు కూటమి ప్రభుత్వం సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికీ మొదటి రోజే పింఛన్ అందించారన్నారు.

రేషన్ సరుకుల్లో కోతలను అరికట్టండి

యాడికి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల్లో బియ్యం తూకాల్లో కోతలను అరికట్టాలని సోమవారం సీపీఐ, రైతు సంఘం నాయకులు తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మండలంలోని రేషన్ దుకాణాల్లో డీలర్లు బియ్యం తూకంలో తక్కువ వేస్తున్నారని ఆరోపించారు. వినతిపత్రం నాయకులు వెంకటరాముడుయాదవ్, ఓబులరెడ్డి, కుళ్లాయిరెడ్డి పాల్గొన్నారు.

గోలంక భూమికి హద్దులు చూపండి

కుందుర్పి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కుందుర్పి గ్రామ పొలం లో గోలంకకు సంబంధించిన భూములకు హద్దులు చూపించి పట్టాలు మంజూరు చేయాలని తహసీల్దార్ ఓబులేసుకు సోమవారం దళితులు వినతిపత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ 76 ఎకరాల 16 సెంట్లు విస్తీర్ణం ఉన్న భూమి మా పెద్దల ఆధీనంలో వుందని, మా అన్నదమ్ములకు హద్దులు ఏర్పాటు చేసి పాసు పుస్తకాల మంజూరు చేయాలని కోరారు. వైబీ ఓబయ్య, అన్నదమ్ములు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు రెండు అర్జీలు

శెట్టూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికకు రెండు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ ఈశ్వరమ్మ తెలిపారు. తిప్పనపల్లి గ్రామంలో చెరువును పలువురు కబ్జా చేశారని రిటైర్డ్ డీఎస్పీ కృష్ణారెడ్డి తహసీల్దారు ఫిర్యాదు చేశారు. సమస్యను ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని అధికారులు తెలిపారు. ఐదుకల్లు ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని పాఠశాల కమిటీ చైర్మన్ లోకనాథ్ అర్జీ ఇచ్చారు. సంబంధిత శాఖ అధికారులతో చర్చించి సర్వే చేయించి పాఠశాలకు ప్రహరీ నిర్మించేందుకు స్థలం కేటాయిస్తామన్నారు. ఎంపీడీవో జిలానీ బాషా, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సురేంద్ర, ఎంఈఓ శ్రీధర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ట్రాన్స్‌కో, పంచాయతీ రాజ్, పోలీసు, వెటర్నరీ శాఖ అధికారులు కార్యక్రమానికి డుమ్మాకొట్టారు.

పంట కోత ప్రయోగాలు చేపట్టండి

బెళుగుప్ప, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బంది కలగకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి పంట కోత ప్రయోగాలు చేపట్టాలని తహసీల్దార్ అనిల్‌కుమార్ సూచించారు. కార్యాలయంలో పంట కోత ప్రయోగాలపై సిబ్బందికి సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 30వ తేదీ లోపు ప్రతి ఎకరాన్ని ఈ క్రాప్ బుకింగ్ చేయాలని సూచించారు. ఈవో పృథ్వీసాగర్, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆవిష్కాంధ్ర యువతకు వరం

తాడిపత్రి, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆవిష్కాంధ్ర-ఒక కుటుంబం-ఒక ఎంటర్‌ప్రిన్యూయర్ కార్యక్రమం యువతకు ఒక వరమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా యువతకు ఎన్నో వ్యాపారాలు చేయడానికి ఆలోచనలు ప్రేరేపిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ నూతన ఆవిష్కరణలు చేయడానికి ప్రయత్నించాలని ఆమె కోరారు. అధ్యాపకులు గురుమోహన్, ఓబులపతి, విజయభాస్కర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి చేయూతనివ్వాలి

పెద్దవడుగూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రైతాంగ కోర్కుల దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలో సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరాముడుయాదవ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగ సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. సీనియర్ నాయకులు సూర్యనారాయణరెడ్డి, నారాయణ, హుస్సేన్, రామాంజనేయులు, పి. రామాంజనేయులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో ముళ్లపొదలను తొలగించండి

ఉరవకొండ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): హిందువుల శ్మశాన వాటికలో ముళ్లపొదలను తొలగించాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ డివిజనల్ మానిటరింగ్ సభ్యులు కొకుంట్ల రవి కోరారు. మేజరు పంచాయతీ కార్యాలయలంలో సోమవారం కార్యదర్శి గౌస్ సాహెబ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. హిందువులు విజయదశమి రోజున శ్మశాన వాటికకు వెళ్లి పెద్దలకు పూజలు నిర్వహిస్తారన్నారు. సమాధుల వద్దకు వెళ్లేందుకు దారి లేక కంపచెట్లు మూసు పోయాయయని వారు తెలిపారు. తక్షణమే శుభ్రం చేయాలన్నారు. వార్డు సభ్యులు చేజాల ప్రభాకర్, రామాంజనేయులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ మాతృమూర్తి హిరాబెన్ మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను స్థానిక పొట్టిశ్రీరాములు సర్కిల్‌లో బీజేపీ నాయకులు సోమవారం దహనం చేశారు. నాయకులు మాట్లాడుతూ బిహార్ రాష్ట్రంలో ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఓటర్‌వికాస్ యాత్రను ప్రారంభించారన్నారు. రాహుల్ తీరు భిన్నంగా ఉందన్నారు. ఆయనపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రవిబాబు, రామాంజనేయులు, హరిహరనాథ్ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల సంబరాలు



కేక్ కట్ చేస్తున్న ఆమ్లెట్ మస్తాన్‌యాదవ్

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి 30 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా స్థానిక 12వ వార్డులో సోమవారం ఏపీ యాదవ సంక్షేమ అభివృద్ధి డైరెక్టర్ ఆమ్లెట్‌మస్తాన్ యాదవ్ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. కేక్‌ను కట్ చేసి బాణాసంచా పేల్చారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు కొనసాగడం గర్వకారణం అన్నారు. పట్టణ యూనిట్ ఇన్చార్జి లక్ష్మయ్యయాదవ్, నాయకులు డ్రామా వెంకటేష్, రుద్రమణి, నరసింహులు, రంగన్న, వీరేష్, వేణు, చంద్ర, అలివేలమ్మ, రామాంజినమ్మ, ధరణి, హేమలత, మంజులత పాల్గొన్నారు.

రిజర్వాయరుకు 2120 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు 2120 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తున్నట్లు సోమవారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో కింద 2080 క్యూసెక్కులు వెళుతుండగా ప్రస్తుతం రిజర్వాయరులో 1.705 టీఎంసీల నీటి నిల్వ వుందని, ఫేజ్-2కు 1609 క్యూసెక్కులు వెళుతున్నాయని తెలిపారు.

సామాజిక సేవకులకు ఘన సన్మానం

యాడికి, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలో సామాజిక సేవ చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న పలువురికి సోమవారం రాయల చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ శ్రీధర్ ఘనంగా సన్మానించారు. యాడికి హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ సంజీవరాయుడును సన్మానిస్తూ రూ.10వేల చెక్కును అందించారు. యోగా శిక్షకుడు గరిడి శివన్న, మే ఐ హెల్ప్‌యూ ప్రెసిడెంట్ బండారు బాలకృష్ణ, ధ్రువనారాయణ, వృద్ధాశ్రమ నిర్వాహకుడు వెంకటరాముడు తదితరులను సన్మానించారు. ఎంఈఓ కాశప్ప, ప్రధానోపాధ్యాయుడు సీతారామాంజనేయులు, ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసులు, శశిధర్, ఆనంద్, బాల పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకు ప్రారంభం



తాగునీటి ట్యాంకును ప్రారంభిస్తున్న పుల్లారెడ్డి


పుట్లూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ కాలనీలో ప్రజల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన తాగు నీటి ట్యాంక్‌ను సోమవారం టీడీపీ నాయకుడు పుట్లూరు పుల్లారెడ్డి ప్రారంభించారు. కొద్దిరోజులుగా కాలనీలో తాగునీటి సమస్య అధికం కావడంతో స్థానికులు పుల్లారెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన రూ.27వేల సొంత నిధులను ఖర్చుచేసి తాగునీటి ట్యాంక్‌ను ఏర్పాటుచేయించాడు. నాయకులు రామాంజనేయులు, శివారెడ్డి, తేజారెడ్డి, నరసింహ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ

బ్రహ్మసముద్రం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ అందించిన సమాచారం మేరకు సోమవారం మండల వ్యవసాయాధికారి, క్వాలిటీ కంట్రోల్ శ్రావణ్‌కుమార్, వ్యవసాయ విస్తరణాధికారి నందకిరణ్‌తో కలిసి వేపులపర్తిలోని శ్రీ లక్ష్మీనరసింహ ఫర్టిలైజర్స్ అండ్ సీడ్స్ దుకాణాన్ని తనిఖీ చేశారు. స్టాక్ బోర్డు సరిగా లేదని, ధర వివరాలు, స్టాకు బోర్డులో చూపించక పోవడం, స్టాక్ రిజిస్టర్‌కు డీబీటీకు మధ్య వ్యత్యాసం వుండటం, అనుమతి పత్రాలు లేని వివిధ రకాల కంపెనీలకు చెందిన ఎరువులను సీజ్ చేశారు. నివేదికను సహాయ వ్యవసాయ సంచాలకులు కళ్యాణదుర్గంకు సమర్పించినట్లు తెలిపారు.

యల్లనూరు: స్థానిక ఎరువుల దుకాణాల్లో సోమవారం తహసీల్దార్ రాము, వ్యవసాయాధికారి మధు తనిఖీ చేపట్టారు. దుకాణాలు, గోడౌన్‌లలో నిర్వహించిన ఎరువులను తనిఖీచేశారు. యూరియా అమ్మకాలకు సంబంధించిన రికార్డులను తనిఖీచేశారు.

సైనిక శిబిరానికి విద్యార్థి ఎంపిక



మల్లికార్జున

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో ఢిల్లీలో జరిగే తల్ సైనిక్ క్యాంపునకు ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎన్‌సీసీ విద్యార్థి హెచ్.మల్లికార్జున ఎంపికయ్యాడు. తల్‌సైనిక్ క్యాంప్‌కు ఏపీ, తెలంగాణ రెండు రాష్ట్రాల నుంచి ఎనిమిది మంది విద్యార్థులను సెలెక్ట్ చేయగా అందులో కళాశాలకు చెందిన మల్లికార్జున ఎంపికయ్యాడు. మొదటి యూనిట్ బెటాలియన్ స్థాయిలో ఇంటర్ గ్రూప్ స్థాయిలో, ఏపీ అండ్ తెలంగాణ డైరెక్టరేట్ లెవల్‌లో అర్హత సాధించాలి. ఈ క్యాంపునకు అర్హత సాధించిన వారికి మిలిటరీలోను, ఉన్నత చదువులు చదువుకోవడానికి రాసే పరీక్షలలో అదనపు మార్కులు కేటాయిస్తారన్నారు. అర్హత సాధించిన మల్లికార్జునకు ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ సీ బాలకృష్ణ, అధ్యాపకుడు గోపీనాయక్, విద్యార్థులు అభినందించారు.

పోలీసులు కొట్టారని ఎస్పీకి ఫిర్యాదు

తాడిపత్రి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): వినాయకుడి నిమజ్జనంలో మద్యం సేవించి తోపులాడుతున్న సందర్భంలో నందలపాడుకు చెందిన హేమంత్‌రెడ్డి మరికొంతమంది ఘర్షణ పడతారన్న ఉద్దేశంతో పోలీసులు నచ్చజెప్పి స్టేషన్‌కు తీసుకువచ్చారు. అయితే స్టేషన్ నుంచి హేమంత్ రెడ్డి తప్పించుకొని జిల్లా ఎస్పీకి వెళ్లి ఫిర్యాదు చేశారని సమాచారం.

'నోటీసులు ఉపసంహరించుకోవాలి'

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జగనన్న ప్లాట్‌లలో ఇళ్ల నిర్మాణం చేసుకున్న లబ్ధిదారులకు వీఆర్వో ద్వారా నోటీసులు ఇవ్వడం ఉపసంహరించుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరభద్రస్వామి డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ గతంలో రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు టిడ్కో ఇళ్ల నిర్మాణాలకు పట్టణంలో రెండు వేల పైబడి ఇంటి స్థలాలను రద్దు చేశారన్నారు. రద్దైన ఇంటిస్థలాల లబ్ధిదారులు ఇంటి స్థలం కొరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవడానికి వెళితే మీకు ఇంటి స్థలం ఉన్నదని చూపుతుందన్నారు. పట్టణంలో 6వేలకుపైగా జగనన్న ప్లాటు ఇచ్చారన్నారు. ఇందులో కొంత మంది ఇంటి నిర్మాణాలను పూర్తిచేసుకున్నట్లు తెలిపారు. అనంతరం తహసీల్దార్ రమాదేవికి వినతి పత్రం అందజేశారు. ఎస్‌ఎండీ గౌస్, దేవేంద్ర, ఈశ్వరయ్య, వెంకట్‌నాయక్, ఉమర్‌బాషా పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు



పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

వైసీపీ పాలనలో పత్తాలేని తలారి రంగయ్య

● ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క సమస్య కూడా పరిష్కరించకుండా పత్తాలేకుండాపోయాడని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి రంగయ్యపై ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఘాటు విమర్శలు చేశారు. సోమవారం కంబదూరు మండలం కురాకులపల్లిలో ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛన్లను స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎంపీగా పనిచేసిన ఆయన ఐదేళ్లలో ఏ ఒక్క గ్రామంలో కూడా పర్యటించిన దాఖలాలు లేవన్నారు. గ్రామాలలో ఏయే సమస్యలు వున్నాయో కూడా తెలుసుకోలేని విధంగా ఐదేళ్ల వైసీపీ పాలన సాగిందన్నారు. హంద్రీనీవా కాలువలను వెడల్పు చేసి నీటిని రెట్టింపు తెచ్చుకుంటున్నామన్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలన్నింటినీ సంబంధిత శాఖ మంత్రి వద్దకు తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. 10వ తేదీన జిల్లా కేంద్రంలో జరిగే సూపర్ సిక్స్, సూపర్ హిట్ సభకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వస్తారని నియోజకవర్గ సమస్యలను తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తానన్నారు. కురాకులపల్లి గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించి కొత్తగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి అమిలినేని లక్ష్మీనారాయణ, కరణం రామ్మోహన్ చౌదరి, జయప్రకాష్, శ్రీరాములు, వెంకటేశులు, సింగిల్ విండో అధ్యక్షుడు బాబయ్య పాల్గొన్నారు.

ఒకటో తేదీనే పింఛన్ ఇస్తున్న సీఎం: ఎమ్మెల్యే



ఎమ్మెల్యేకు మిఠాయి తినిపిస్తున్న టీడీపీ నాయకులు

గుంతకల్లు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పింఛన్ ఎప్పుడిస్తారో తెలియని పరిస్థితి నుంచి.. నెల మొదటి రోజే ఇంటి తలుపుతట్టి పింఛన్ ఇచ్చే పరిస్థితిని సీఎం చంద్రబాబు తెచ్చారని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. పట్టణంలోని 7వ వార్డులో పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అనర్హులకు, కార్యకర్తలకు పింఛన్లను మంజూరు చేసిన జగన్ ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమే కాక, రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేశాడన్నారు. దివ్యాంగ పింఛను మొత్తాన్ని చంద్రబాబు రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచారని, అనర్హులైన లబ్ధిదారులను తొలగిస్తేనే అర్హులకు సమర్థవంతంగా పింఛన్లను అందించగలుగుతారన్నారు. టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప, గుణశేఖర్, ఫజులు, రామన్న చౌదరి, హనుమంతు, కదిరప్ప, పత్తి హిమబిందు, మత్రునాయక్, ఫ్రూట్ మస్తాన్, గుజరీ ఖాజా, అంజి, చిప్పగిరి ప్రతాప్ పాల్గొన్నారు.

కొత్తపల్లిలో వైద్యశిబిరం

బొమ్మనహాళ్, సెప్టెంబరు1, (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్గాహొన్నూరు గ్రామ పంచాయతీ కొత్తపల్లి గ్రామంలో సోమవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఆదివారం గ్రామంలోని వరుణ్ అనే యువకుడు జ్వరంతో మృతి చెందడంతో స్థానిక వైద్యాధికారి రఫియాసుల్తాన్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఇంటింటికి తిరిగి జ్వరంపై సర్వే చేశారు. దగ్గు, జలుబు, కాళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి రక్తపరీక్షలు చేసినట్లు వైద్యులు తెలిపారు. వరుణ్ మృతిపై ఎంపీడీఓ విజయభాస్కర్, డిప్యూటీ ఎంపీడీఓ దాస్ విచారణ చేశారు. జ్వరంతో పాటు పచ్చ కమెర్లు కావడంతో మృతి చెందినట్లు తెలిపారు.

భూ వివాదంతో మహిళ ఆత్మహత్యాయత్నం

పుట్లూరు, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నమల్లేపల్లి గ్రామానికి చెందిన సావిత్రమ్మ అనే మహిళ భూ వివాదంతో సోమవారం ఆత్మహత్యకు యత్నించింది. పోలీసులు తెలిపిన మేరకు గరుగుచింతలపల్లి రెవెన్యూ పొలం సర్వే నం.72లో 5ఎకరాల భూమి ఉంది. అదే గ్రామానికి చెందిన కులందర్‌రెడ్డి మరో వ్యక్తి కలిసి తాము కొనుగోలు చేశామని, ఆధారాలు ఉన్నాయని రెవెన్యూ అధికారుల దృష్టికి పలుమార్లు ఫిర్యాదు చేశారు. సోమవారం మధ్యాహ్నం కులందర్‌రెడ్డి, వెంకటనారాయణరెడ్డి ఆ భూమిలో ట్రాక్టర్‌తో సేద్యం చేయడానికి వెళ్లారు. గమనించిన సావిత్రమ్మ అడ్డుకోవడానికి వెళ్లగా వారు పట్టించుకోకుండా సేద్యంచేశారు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె ఇంటికి వచ్చి పురుగుల మందు తాగింది. గమనించిన స్థానికులు తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఏడాదిక్రితం సావిత్రమ్మ భర్త చెన్నకేశవరెడ్డి అనారోగ్యంతో చనిపోయారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


రెండు దుకాణాల్లో చోరీ

తాడిపత్రి, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం తెల్లవారుజామున ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని రెండు దుకాణాల్లో చోరీ జరిగిందని నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సెల్‌ఫోన్ దుకాణంలో రేకును కట్‌చేసి లోపలికి చొరబడి మూడు సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లారని నిర్వాహకుడు వీరా, బార్బర్ షాపులో రూ.27వేలు నగదు ఎత్తుకెళ్లారని రఘు ఫిర్యాదుచేశారు. వారి ఫిర్యాదు మేరకు విచారించి కేసునమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

కారు ఢీ కొని ఇద్దరికి గాయాలు

కణేకల్లు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుంట గ్రామం వద్ద సోమవారం సాయంత్రం కారు ఢీ కొన్న ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. బొమ్మనహాళ్ మండలం ఏళంజి గ్రామానికి చెందిన ఎల్లప్ప(47), రామాంజనేయులు(60) అనే సోదరులు బెళుగుప్ప మండలం శ్రీరంగాపురంలో తమ బంధువులు చనిపోగా అంత్యక్రియలకు సోమవారం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో సాయంత్రం యర్రగుంట వద్ద బళ్లారి నుంచి వచ్చిన కారు సోదరులు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డారు. 108లో వారివురిని కణేకల్లు ప్రభుత్వాసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందజేసి ఉన్నత చికిత్సకు బళ్లారికి తరలించారు.

వాహనం బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు



బోల్తాపడిన బొలెరో వాహనం

విడపనకల్లు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద కొట్టాలపల్లి గ్రామం వద్ద బొలెరో బోల్తా పడి డ్రైవర్ ప్రశాంతకుమార్‌కు తీవ్ర గాయాలైన ఘటన సోమవారం చోటు చేసుకుంది. పాల్తూరు పోలీసులు తెలిపి మేరకు ఉవరకొండకు చెందిన ప్రశాంత్ కుమార్ ఆదివారం రాత్రి కొంత మంది రైతులకు చెందిన వేరుశనగ కాయలను బళ్లారి మార్కెట్‌కు బొలెరో వాహనంలో లోడ్ వేసుకుని వెళ్లాడు అన్నారు. బళ్లారి మార్కెట్‌లో వేరుశనగ కాయలను అన్‌లోడ్ చేసి ఉరవకొండకు ఆదివారం అర్ధరాత్రి తిరిగి వస్తున్న సమయంలో పెద్ద కొట్టాలపల్లి వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి బ్రిడ్జి గోడను ఢీ కొట్టాడు అన్నారు దీంతో వాహనం అదుపుతప్పి పక్కనే ఉన్న పొలంలో పడింది. డ్రైవర్ ప్రశంత్‌కుమార్ స్పృహతప్పి వాహనంలోనే ఇరుక్కుపోయాడు. సోమవారం తెల్లవారు జామున స్పృహలోకి వచ్చిన ప్రశంత్‌కుమార్ సైడ్ అద్దాలను పగలకొట్టుకుని బయటకు వచ్చి ఉరవకొండ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వెళ్లినట్లు తెలిపారు. పాల్తూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అయితే వాహనం బోల్తా పడి అందులో ఉన్న డ్రైవర్ స్పృహలో లేని సమయంలో వాహనంలో ఉన్న వేరుశనగ కాయల డబ్బులు రూ.2లక్షలు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు బంధువుల తెలుపుతున్నారు. వాహనంలో ఉన్న డబ్బులు మొత్తం గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లటంతో రైతులకు ఏమి ఇవ్వాలో అని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.